

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయానికి కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 16.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 176 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


# ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు





- మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు







**విజయవాడ, అక్టోబరు 15(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చి దిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మిగతా 2లో...

## మహిళలే సంపద సృష్టికర్తలు

- గ్రామీణ ఆర్థిక ప్రగతికి ఎస్‌హెచ్‌జీలే వెన్నెముక
- ఆర్థిక, సాంకేతిక, సామాజిక సాధికారతతో ముందడుగు
- ఆదాయం, ఆస్తులపై మహిళలకు నిర్ణయాధికారం ఉండాలి
- జాతీయ సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**విజయవాడ, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ మహిళలు దేశ ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక, సామాజిక సాధికారతకు కొత్త మార్గాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. మహిళా వ్యాపారవేత్తల సంఖ్య పెరుగుతుండటంతో పాటు ఆర్థిక నిర్ణయాల్లో గ్రామీణ మహిళల భాగస్వామ్యం కూడా పెరుగుతోందని, సమాన, సమ్మిళిత అభివృద్ధికి ఇది ఎంతో అవసరమని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సరస్ మేళాలోని వివిధ స్టాళ్లను పరిశీలించి, 'లఖ్‌పతి దీదీ'లతో ముచ్చటించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులు, వారి వ్యాపార కార్యకలాపాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, సాధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఎస్‌హెచ్‌జీల పాత్ర :** మహిళల స్వయం సహాయక సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సమర్థంగా దోహదపడుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. గత 12 ఏళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలతో అనుసంధానమైన వారి సంఖ్య 10 కోట్లకు పైగా పెరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 90 లక్షలకు పైగా స్వయం సహాయక సంఘాల్లో మహిళలు భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. మిగతా 2లో...



## రాష్ట్రపతితో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఉదయం విజయవాడ నోవాటెల్ హోటల్ కు వెళ్లిన మంత్రి లోకేష్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము ని శాలువాతో ఘనంగా సత్కరించి మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించారు.

## ధ్రువపత్రాలు.. 24 గంటల్లోనే



- నో డ్యూస్, కుల ధ్రువపత్రాల జారీలో జాప్యానికి తావులేదు
- అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలి
- కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

2లో

**అమరావతి, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలను ఒకే దశలో, ఒకే షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని స్థానిక సంస్థలకు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 100 పట్టణ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ జారీ చేశామని, ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలోగా మిగిలిన 23 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు షెడ్యూల్, నోటిఫికేషన్లు విడుదల చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున,

## నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం

- స్థానిక సంస్థల ఎన్నికలకు 28 మంది ఐఏఎస్ పరిశీలకులు
- నియమావళి అమలుపై నిరంతర పర్యవేక్షణ
- పటిష్ఠ భద్రత.. అధికారుల మధ్య సమన్వయం

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

• వివరాలు 2 లో

## జగన్ కేసులపై డైలీ ట్రయల్



- ఈడీ దాఖలు చేసిన తొమ్మిది ఛార్జిషీట్లపై విచారణ
- అరబిందో, హెటిరో కేసుల్లో డిశ్చార్జి పిటిషన్‌పై వాదనలు
- సీబీఐ, ఈడీ కేసులను సమాంతరంగా విచారిస్తున్న కోర్టు

**హైదరాబాద్, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్లపై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం రోజువారీ విచారణను ప్రారంభించింది. - 2లో...

## మహిళా శక్తితోనే వికసిత భారత్

- మహిళలు మార్కెట్‌ను సృష్టించే స్థాయికి ఎదగాలి
- జాతీయ సరస్ మేళాలో 15 వేల మందికి నైపుణ్య శిక్షణ
- సంఘాల ఉత్పత్తులకు నాణ్యత, బ్రాండింగ్‌తో విస్తృత మార్కెట్లు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



**విజయవాడ:** మహిళా శక్తిని ఆర్థిక శక్తిగా మార్చడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గ్రామీణ మహిళలు మార్కెట్‌కు వెళ్లి ఉత్పత్తులు కొనుగోలు చేసేవారిగానే కాకుండా.. మార్కెట్‌ను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు సరైన అవకాశాలు, నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహకారం అందిస్తే వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించగలరని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.

**మూడు కోట్ల మందికి పైగా లఖ్‌పతి దీదీలు :** ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమైన ఆరు కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ఇప్పటికే సుమారు మూడున్నర కోట్ల మంది మహిళలు లక్ష్యాన్ని చేరుకున్నారని పెమ్మసాని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఒకప్పుడు బ్యాంకు గుమ్మం తొక్కడానికే భయపడిన మహిళలు నేడు బ్యాంకింగ్ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మిగతా 2లో...

## కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు!

- కార్పొరేషన్లలో టీడీపీకి 11, జనసేనకు 4, బీజేపీకి 2
- మున్సిపాలిటీల్లోనూ కొలిక్కి వచ్చిన స్థానాల పంపకం
- ఉమ్మడి ప్రచారానికి మూడు పార్టీల నేతల సన్నద్ధం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి అధికార పక్ష కూటమి సమరశంఖం పూరించింది. సుదీర్ఘ చర్చలు, నియోజకవర్గాల వారీ సమీక్షల అనంతరం తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ల మధ్య మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల స్థానాల కేటాయింపు ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. క్షేత్రస్థాయి బలాబలాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని మూడు పార్టీల అగ్రనేతలు స్థానాల పంపకంపై తుది నిర్ణయానికి వచ్చారు. మొత్తం స్థానాల్లో సింహభాగాన్ని తెలుగుదేశం పార్టీ దక్కించుకోగా, ఆ తర్వాత స్థానాల్లో జనసేన, బీజేపీలు పోటీ చేయనున్నాయి. తాజా ఒప్పందం ప్రకారం కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన స్థానాల వివరాలు ఇలా ఉన్నాయి.

**కార్పొరేషన్ల వారీగా పంపకాలు:** రాష్ట్రంలోని కీలకమైన మున్సిపల్ కార్పొరేషన్ల పంపకాల్లో తెలుగుదేశం పార్టీ పైచేయి సాధించింది. మొత్తం కార్పొరేషన్లలో టీడీపీ 11 స్థానాల్లో, జనసేన 4 స్థానాల్లో, బీజేపీ 2 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించనున్నాయి.

తెలుగుదేశం పార్టీ (11): విజయనగరం, గ్రేటర్ విశాఖపట్నం, మచిలీపట్నం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి, చిత్తూరు.

**జనసేన పార్టీ (04):** శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ.

**భారతీయ జనతా పార్టీ (02):** రాజమండ్రి, అనంతపురం. మిగతా 2లో...

## ఉద్యోగులకు తీపికబురు..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతానికి హైదరాబాద్ నుంచి తరలివచ్చిన ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న ఉచిత తాత్కాలిక నివాస వసతి గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. 2026 జూన్ 27 నుంచి ఏడాది పాటు లేదా అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ప్రభుత్వ నివాస గృహాలను కేటాయించే వరకు, ఈ రెండింటిలో ఏది ముందైతే అప్పటి వరకు ఈ సదుపాయం కొనసాగనుంది. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ సదుపాయాన్ని 2026 జూన్ 26 వరకు పొడిగించారు. అయితే, ఉద్యోగుల వసతి అవసరాలు, ప్రస్తుత ఏర్పాట్లను సమీక్షించడంతో పాటు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సమర్పించిన లేఖను పరిశీలించిన ప్రభుత్వం తాజాగా మరో ఏడాది పాటు వసతి సదుపాయాన్ని కొనసాగించాలని నిర్ణయించింది.

# మహిళలే సంపద సృష్టికర్తలు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాల ఆర్థిక సంక్షేమానికి మహిళలు గణనీయమైన తోడ్పాటును అందిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరగడం ద్వారా మహిళా కేంద్రిత, సమ్మిళిత గ్రామీణ అభివృద్ధికి మార్గం సుగమమవుతోందన్నారు. సామూహిక వ్యాపారాలకు కూడా విస్తృత అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు.

స్వయం సహాయక సంఘాలు కేవలం ఆదాయ మార్గాలకే పరిమితం కాకుండా సమాజాభివృద్ధికి సంబంధించిన వివిధ కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. గ్రామీణ జీవన సమగ్ర పరివర్తనకు, దేశ సమ్మిళిత అభివృద్ధికి ఎస్‌హెచ్‌జీలు గణనీయమైన సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.



**లఖ్‌పతి దీదీ కార్యక్రమంతో కొత్త ఊపు :** 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దిశ, వేగం కల్పించిందని రాష్ట్రపతి తెలిపారు. గ్రామీణ మహిళలు సంప్రదాయ రంగాలతోపాటు ఆధునిక రంగాల్లోనూ అడుగుపెడుతున్నారని చెప్పారు. డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని, దీనివల్ల నైపుణ్యాభివృద్ధికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు.

గ్రామీణ మహిళలు ఇప్పుడు కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా లేరని, సంపద సృష్టికర్తలుగా, అభివృద్ధికి చోదక శక్తులుగా ఎదుగుతున్నారని రాష్ట్రపతి అన్నారు. కుటుంబం, గ్రామం, దేశ ఆర్థిక పురోగతిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆదాయం, ఆస్తులపై నియంత్రణ ఉండాలి :** మహిళా సాధికారతలో ఇంకా సాధించాల్సింది ఎంతో ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. గ్రామీణ మహిళలు తమ సొంత ఆదాయం, ఆస్తులపై ఎంతమేర నియంత్రణ సాధించారన్నదే సాధికారతకు ముఖ్యమైన కొలమానంగా ఉండాలని అన్నారు. ఆదాయం సంపాదించడంతోపాటు దాని వినియోగం, పొదుపు, పెట్టుబడుల విషయంలోనూ మహిళలకు నిర్ణయాధికారం ఉండాలని సూచించారు.

అదే సమయంలో కుటుంబ సంరక్షణ బాధ్యతలను మహిళలు మాత్రమే మోయకుండా సమాజ ఆధారిత సహాయక వ్యవస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు, వృద్ధుల సంరక్షణ వంటి గృహ బాధ్యతల్లో సహాయక వ్యవస్థలు అందుబాటులోకి వస్తే మహిళలు తమ వ్యాపార, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించగలరని తెలిపారు.

**వాతావరణ అనుకూల వ్యాపారాల్లో భాగస్వామ్యం :** వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే వ్యాపారాల్లోనూ గ్రామీణ మహిళల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి అన్నారు. పర్యావరణహిత ఉత్పత్తులు, పునరుత్పాదక ఇంధనం, వాతావరణ అనుకూల వ్యవసాయం వంటి రంగాల్లో మహిళలకు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు కల్పించాలని సూచించారు.

గ్రామీణ మహిళల నైపుణ్యాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించడం ద్వారా వారి ఆదాయ అవకాశాలను మరింత పెంచవచ్చని తెలిపారు. సామూహిక వ్యాపారాల ద్వారా చిన్నస్థాయి ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు తీసుకెళ్లేందుకు అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**గ్రామీణ మార్కెట్లుగా సరస్ మేళాలు :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే వేదికలుగా సరస్ మేళాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇవి క్రమంగా చైతన్యవంతమైన గ్రామీణ మార్కెట్లుగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలకు దేశవ్యాప్తంగా వినియోగదారులతో నేరుగా అనుసంధానం ఏర్పడుతోందన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే హస్తకళలు, చేనేత, ఆహార ఉత్పత్తులు, సంప్రదాయ వస్తువులకు సరస్ మేళాలు మార్కెట్ అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాల్లో మహిళలకు మరింత శిక్షణ అందిస్తే వారి వ్యాపారాలు విస్తరించే అవకాశం ఉందన్నారు.

**2047 నాటికి వికసిత్ భారత్:** 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో స్వయం సహాయక సంఘాలు, సరస్ మేళాలు ప్రముఖ పాత్ర పోషించగలవని అన్నారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో గ్రామీణ మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక ప్రగతిని మరింత విస్తృతం చేయవచ్చని పేర్కొన్నారు. మహిళల ఆదాయం, నైపుణ్యాలు, వ్యాపార సామర్థ్యాలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థలు కూడా బలపడతాయని తెలిపారు.

**650కు పైగా స్టాళ్లు :** విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాలో 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది మహిళా స్వయం సహాయక సంఘాల వ్యాపారవేత్తలు, లఖ్‌పతి దీదీలు పాల్గొంటున్నారు. 650కు పైగా స్టాళ్లలో వివిధ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తున్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల గ్రామీణ మహిళలు తయారు చేసిన హస్తకళలు, చేనేత ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, సంప్రదాయ వస్తువులు తదితరాలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ మహిళా వ్యాపారవేత్తలకు మార్కెట్ అవకాశాలను విస్తరించడంతో పాటు వినియోగదారులకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేక ఉత్పత్తులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ఈ మేళా ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. జాతీయ సరస్ మేళా అక్టోబర్ 31 వరకు విజయవాడలో కొనసాగనుంది.

# నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం

**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సాధారణ పరిశీలకులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాకు ఒక అధికారి చొప్పున 28 మంది మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిశీలకులకు ఆయన పలు సూచనలు చేశారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషనర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అనుసరించే విధానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పాటించాలని, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించిందని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల నిర్వహణ విధానాలు తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పరిశీలకులకు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఓటు హక్కును వినియోగించుకునే సామాన్య పౌరుల వరకు అందరికీ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవని పేర్కొన్న కమిషనర్, ప్రతి ఓటరు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ లక్ష్య సాధనలో జిల్లా స్థాయి నుంచి జోనల్ స్థాయి వరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు తగిన మార్గదర్శకత్వం అందించడం, ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించడం సాధారణ పరిశీలకుల బాధ్యత అని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# జగన్ కేసులపై డైలీ ట్రయల్

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా అరబిందో, హెటిరో సంస్థలకు సంబంధించిన కేసులో జగన్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌పై గురువారం విచారణ కొనసాగింది. సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావు విచారణ చేపట్టగా, జగన్ తరఫున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనలు ఈ కేసుకు వర్తించవని ఆయన వాదించారు. అసలు క్రిమినల్ కేసులో తుది నిర్ణయం వెలువడకముందే దాని ఆధారంగా ఈడీ కేసు నమోదు చేయడం చట్టబద్ధం కాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**9 ఛార్జిషీట్లలో జగన్ ఏ1 :** జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల వ్యవహారంలో 2006 నుంచి 2021 మధ్య కాలానికి సంబంధించి ఈడీ తొమ్మిది ఛార్జిషీట్లు దాఖలు చేసింది. ఈ కేసులన్నింటిలోనూ జగన్‌ను ఏ1 నిందితుడిగా పేర్కొంది. మరోవైపు సీబీఐ దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లపై ప్రత్యేక కోర్టులో ఇప్పటికే రోజువారీ విచారణ కొనసాగుతోంది.

**ఈడీ కేసులపైనా డైలీ ట్రయల్ :** సీబీఐ కేసుల విచారణ పూర్తయిన తర్వాతే ఈడీ కేసులను విచారించాలనే విధానం కొనసాగుతోందని పేర్కొంటూ ఈడీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ కోర్టులో తమ సంస్థ దాఖలు చేసిన తొమ్మిది కేసుల్లో విచారణలో తగిన పురోగతి లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈడీ కేసులపై కూడా రోజువారీ విచారణ చేపట్టేందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు అంగీకరించింది.

ప్రస్తుతం కోర్టుకు అందుబాటులో ఉన్న సమయాన్ని అనుసరించి సీబీఐ, ఈడీ కేసులను సమాంతరంగా విచారిస్తున్నారు. దీంతో జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో సీబీఐతో పాటు ఈడీ దాఖలు చేసిన కేసుల విచారణ కూడా క్రమం తప్పకుండా కొనసాగనుంది.

# మహిళా శక్తితోనే వికసిత భారత్

(మొదటి పేజీ తరువాయి)

2014లో మహిళా సంఘాల వార్షిక రుణ లావాదేవీలు సుమారు రూ. 23 వేల కోట్లుగా ఉండేవని, ఇప్పటివరకు ఆయా సంఘాలకు దాదాపు రూ. 13 లక్షల కోట్ల రుణాలు అందాయని వివరించారు. డ్వాక్రా సంఘాలకు రూ. 20 లక్షల వరకు రుణాలపై ప్రాసెసింగ్, తనిఖీ, డాక్యుమెంటేషన్ తదితర ఛార్జీలను రద్దు చేయడం ద్వారా ఒక్కో సంఘానికి సుమారు రూ. 33 వేల వరకు ఆదా అయ్యే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకూ విస్తరించిందని తెలిపారు.

**మహిళలకు మార్కెటింగ్‌పై శిక్షణ :** గతంలో ఢిల్లీకి పరిమితమైన జాతీయ సరస్ మేళాను విజయవాడలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని పెమ్మసాని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది మహిళా ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటూ హస్తకళలు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ వస్తువులను ప్రదర్శిస్తున్నారని చెప్పారు.

మేళాను కేవలం విక్రయాల వేదికగానే కాకుండా.. మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్‌పై శిక్షణ అందించే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. రానున్న 15 రోజుల్లో రోజుకు సుమారు వెయ్యి మంది చొప్పున రాష్ట్రానికి చెందిన 15 వేల మంది మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు మెరుగైన ధరలు, విస్తృత మార్కెట్లు కల్పించేందుకు నాలుగు అంశాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ఉత్పత్తుల నాణ్యత పెంచడం, ప్యాకేజింగ్–బ్రాండింగ్‌తో విలువను మెరుగుపరచడం, పెద్ద వ్యాపార సంస్థలు–రిటైల్ మార్కెట్లతో అనుసంధానం చేయడం, ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయాలను విస్తరించడం ఇందులో భాగమని వివరించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు, ఆసక్తి ఉన్న మహిళలు సరస్ మేళాను సందర్శించి శిక్షణ అవకాశాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

**సంఘాల లావాదేవీల్లో పారదర్శకత :** మహిళా సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టిందని పెమ్మసాని తెలిపారు. సంఘాల సమగ్ర వివరాలు, ఆర్థిక లావాదేవీలను డిజిటలైజ్ చేసేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లోకోస్ వ్యవస్థను తీసుకొచ్చిందని చెప్పారు.

గ్రామీణ మహిళలు కుటుంబ నిర్వహణతో పాటు వ్యాపారాలను అభివృద్ధి చేయడంలోనూ, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ల వినియోగంలోనూ ముందుకు సాగాలని సూచించారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా మరెన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించగలరని అన్నారు.

**రాష్ట్రపతి జీవితం స్ఫూర్తిదాయకం :** ఒడిశాలోని మారుమూల ప్రాంతం నుంచి దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపదీ ముర్ము జీవితం మహిళల ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు, సామర్థ్యానికి నిదర్శనమని పెమ్మసాని పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో సామాజిక అడ్డంకులు, వ్యక్తిగత విషాదాలు ఎదురైనా వాటిని అధిగమించి సమాజ సేవకు అంకితమైన ఆమె ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు.

జాతీయ సరస్ మేళా విజయవంతానికి కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.



**రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు :** ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ. 69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని.. భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.

**ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి :** సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అనిత తదితరులు హాజరయ్యారు.

# కూటమి పార్టీల సీట్ల సర్దుబాటు ఖరారు!

(మొదటి పేజీ తరువాయి)

**మున్సిపాలిటీల కేటాయింపు ఇలా :** ఉమ్మడి జిల్లాల వారీగా, స్థానిక ప్రాధాన్యతలను బట్టి మున్సిపాలిటీలను కేటాయించారు.

జనసేన పోటీ చేసే మున్సిపాలిటీలు (21) : ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమలోని కొన్ని కీలక పురపాలక సంఘాలను జనసేన కైవసం చేసుకుంది.

**ఉత్తరాంధ్ర :** పాలకొండ, రాజాం, సాలూరు.

**ఉమ్మడి తూర్పు గోదావరి :** తుని, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట, అమలాపురం, ముమ్మిడివరం.

**ఉమ్మడి పశ్చిమ గోదావరి :** నిడదవోలు, నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం.

**కృష్ణా, గుంటూరు జిల్లాలు :** తిరువూరు, పెడన, తెనాలి, చిలకలూరిపేట.

**ప్రకాశం, రాయలసీమ :** దర్శి, మడకశిర, పుట్టపర్తి, పుత్తూరు.

**బీజేపీ పోటీ చేసే మున్సిపాలిటీలు (07) :** పలు జిల్లాల్లో పట్టున్న స్థానాలను కమలం పార్టీ దక్కించుకుంది.

**కోస్తాంధ్ర :** నెల్లిమర్ల, యలమంచిలి, బాపట్ల, కావలి, గూడూరు (నెల్లూరు జిల్లా).

**రాయలసీమ, ప్రకాశం :** కూటమి గిద్దలూరు, ఎర్రగుంట్ల, గూడూరు (కర్నూలు).

**సమన్వయంతో ముందుకు :** సీట్ల సర్దుబాటు ముగియడంతో కూటమి శ్రేణులు క్షేత్రస్థాయిలో ఉమ్మడి ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ఎక్కడా అసమ్మతికి తావులేకుండా, అంతర్గత విభేదాలను పక్కనబెట్టి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కూటమి విజయకేతనం ఎగరేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు.

# మేయర్ అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ ఫోకస్ పెంచింది. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో గెలుపు దిశగా పావులు కదుపుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో మేయర్లుగా గెలిచే ఆస్కారం ఉన్న వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసిన అధిష్ఠానం.. తాజాగా వారి పేర్లను ప్రకటించింది. ఏలూరు – గంటా మోహన్ రావు, మచిలీపట్నం – లంకా జ్యోతి, కడప – బండి దీప్తిరెడ్డి, ఒంగోలు – కుప్పం ప్రసాద్, విజయనగరం – కోలగట్ల శ్రావణి, విశాఖపట్నం – వరుదు కల్యాణి, నెల్లూరు – ఆనం విజయ్ కుమార్, కర్నూల్ – ఎం. సుశీల, విజయవాడ – రాయని భాగ్యలక్ష్మి, పులివెందుల – వైఎస్ ప్రమీలమ్మ, బద్వేల్ – వెంకటసాయికృష్ణ, చీరాల – ఇస్తర్ల షెర్లి, తెనాలి – మద్దాలి శేషాచలం, కొండపల్లి – నల్లమోతు తేజస్వి, రామచంద్రాపురం – నాగేశ్వరరావు, కొవ్వూరు – మన్నెపద్మ, తుని – పిట్ల రామతులసి, యలమంచిలి – బి. తులసి, నర్సీపట్నం – చింతకాయల అనిత, పలాస – తలసు శ్రీపద్మ, ఇచ్ఛాపురం – రాజ్యలక్ష్మి, మదనపల్లె – జింక చలపతి, ప్రొద్దుటూరు – పి. నర్సింహారెడ్డి, వైసీపీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థులుగా ప్రకటించింది.

అలాగే ఆరు నగర పంచాయతీలకు కూడా వైఎస్సార్సీపీ అధిష్టానం అభ్యర్థుల్ని ప్రకటించింది. ఏలేశ్వరం నగర పంచాయతీ అభ్యర్థిగా బి. ఆశాలత, ఉయ్యూరు నగర పంచాయతీ అభ్యర్థిగా పి. దివ్య, గురజాల వైసీపీ నగర పంచాయతీ అభ్యర్థిగా పోలు వీరారెడ్డి, కనిగిరి నగర పంచాయతీ అభ్యర్థిగా పులి శాంతిరెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ అభ్యర్థిగా షేక్ షకీలా బేగం, కమలాపురం నగర పంచాయతీ అభ్యర్థిగా మర్జుల కవితలను ప్రకటించింది.

# ధ్రువపత్రాలు.. 24 గంటల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

పురపాలక శాఖ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పునేఠా బుధవారం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్దేశిత గడువులో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాల్సి ఉందన్నారు. అన్ని స్థానిక సంస్థలకు సమగ్రంగా ఒకేసారి షెడ్యూల్ ప్రకటించడం వల్ల ఇప్పటికే చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లకు కొనసాగింపు లభిస్తుందని వివరించారు.




**24 గంటల్లో ధ్రువపత్రాలు :** ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేయడంలో జాప్యం ఉండకూడదని పునేఠా స్పష్టం చేశారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోగా నో డ్యూస్, కుల ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు.

**60 రోజుల పాటు బ్యాలెట్ పత్రాల భద్రత :** ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూడా బ్యాలెట్ పత్రాలను 60 రోజుల పాటు భద్రపరచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు పునేఠా తెలిపారు. గతంలో 30 రోజుల వరకే భద్రపరిచే విధానం ఉండేదని, రాజకీయ పార్టీల విజ్ఞప్తుల మేరకు ఈ వ్యవధిని పెంచినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు, ఫిర్యాదులు లేదా న్యాయపరమైన అంశాలు తలెత్తినప్పుడు అవసరమైన రికార్డులు అందుబాటులో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**ఫలితాల వరకు అభ్యర్థులకు భద్రత :** ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అభ్యర్థులకు అవసరమైన భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీలను ఆదేశించినట్లు పునేఠా చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అదనపు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఐజీని కేటాయిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణా, పంపిణీని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి కేంద్ర బలగాలను వినియోగించాలా లేదా అనే అంశాన్ని డీజీపీ పరిశీలిస్తారని తెలిపారు.

**సీనియర్ అధికారులతో పరిశీలన :** జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఎన్నికల పరిశీలకులుగా నియమించనున్నట్లు పునేఠా వెల్లడించారు. ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించేందుకు ఐఎఫ్ఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించే ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.

ఇప్పటికే అమలులో ఉన్న సంక్షేమ పథకాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను యథావిధిగా కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు కొత్త సంక్షేమ పథకాలు లేదా కొత్త అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు అనుమతి ఉండదన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదని తెలిపారు.

**ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూంలు :** ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్లు పునేఠా తెలిపారు. అందిన ఫిర్యాదులపై వేగంగా స్పందించేలా ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రచార సామగ్రి వినియోగంపై నియంత్రణ ఉంటుందని స్పష్టం చేశారు. సంబంధిత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు తీసుకోకుండా ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు.

తదుపరి ఎన్నికలకు ఆన్‌లైన్ నామినేషన్లులి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి నామినేషన్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ప్రభుత్వం నుంచి పొందేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నామినేషన్ ప్రక్రియను మరింత సులభతరం, పారదర్శకంగా నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# ఎస్‌బిఐ రుణాలు ప్రియం

**ముంబయి :** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రుణాలపై వడ్డీ రేట్లను పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఇటీవల రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచిన నేపథ్యంలో ఎస్‌బిఐ కూడా రుణ వడ్డీ రేట్లను సవరించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత రుణ వడ్డీ రేటు (ఇబిఎల్ఆర్), రెపో అనుసంధానిత రుణ వడ్డీ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)లను 25 బేసిస్ పాయింట్ల (0.25 శాతం) చొప్పున పెంచింది. దీంతోపాటు వివిధ కాలపరిమితులకు సంబంధించిన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ వడ్డీ రేట్లను (ఎంసిఎల్ఆర్) 15 బేసిస్ పాయింట్ల మేర సవరించింది. కొత్త రేట్లు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా ఫ్లోటింగ్ వడ్డీ రేట్లకు అనుసంధానమైన గృహ, వ్యక్తిగత, వాహన రుణాలపై నెలవారీ వాయిదాలు (ఇఎంఐ) పెరిగే అవకాశం ఉంది. తాజా సవరణ ప్రకారం ఇబిఎల్ఆర్ రేటు 7.90 శాతం నుంచి 8.15 శాతానికి పెరిగింది. రెపో అనుసంధానిత రుణ వడ్డీ రేటు 7.50 శాతం నుంచి 7.75 శాతానికి చేరింది. మరోవైపు బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బిపిఎల్ఆర్) వార్షికంగా 14.65 శాతం వద్ద కొనసాగుతోంది. ఈ పరిణామంతో? రుణ ఒప్పందంలోని నిబంధనలను బట్టి నెలవారీ ఇఎంఐ పెరగడం లేదా రుణ చెల్లింపు కాలపరిమితి పొడిగించడం జరగవచ్చు.

## బీజేపీలో చేరిన కావటి విక్రమ్ నాయుడు



- పీవీఎన్ మాధవ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్న గుంటూరు నేత

**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరుకు చెందిన కావటి విక్రమ్ నాయుడు బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం రాత్రి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు విక్రమ్ నాయుడిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు విక్రమ్ నాయుడు కృషి చేయాలని సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు.

కావటి విక్రమ్ నాయుడుతో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీలో చేరిన వారికి నాయకులు కండువాలు కప్పి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తాడువాయి రామకృష్ణ, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లేశ్వరి, ఎస్సీ జిల్లా అధ్యక్షుడు ధార అంబేద్కర్, ధార్మిక సెల్ నాయకుడు ప్రతాప్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 1,450 విద్యుత్ బస్సుల ప్రైవేటు టెండర్లు రద్దు చేయాలి



- 22, 23 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన.. 26న విజయవాడలో సమావేశం

**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీఎస్ఆర్టీసీలో 1,450 ఏసీ విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించేందుకు జారీ చేసిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. 29 డిపోల్లో జీసీసీ విధానంలో ప్రైవేటు సంస్థల ద్వారా బస్సుల నిర్వహణను వ్యతిరేకిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

**ఆర్టీసీయే బస్సులు కొనుగోలు చేయాలి:** విద్యుత్ బస్సుల ప్రవేశాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీయే బస్సులు కొనుగోలు చేసి సొంత ఉద్యోగులతో నిర్వహించాలని జేఏసీ కోరింది. ప్రైవేటు సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వల్ల ఉద్యోగ భద్రత, ఆర్టీసీ ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంది. సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేయడంతో పాటు 4 వేల కొత్త బస్సులు సమకూర్చాలని డిమాండ్ చేసింది.

**22, 23 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన:** ప్రైవేటు టెండర్ల రద్దు కోసం ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ నిరసన చేపట్టనున్నట్లు జేఏసీ ప్రకటించింది. మూసివేసిన విద్యాధరపురం, గుంటూరు–2, నెల్లూరు–2, మంగళం డిపోలను పునఃప్రారంభించాలని కూడా కోరింది.

**26న విజయవాడలో సమావేశం:** అక్టోబర్ 26న విజయవాడలో జేఏసీ సమావేశం నిర్వహించి తదుపరి ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి టెండర్లను రద్దు చేసి జేఏసీతో చర్చలు జరపాలని కోరారు. స్పందన లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది చిన్నారులు మృతి



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లో గురువారం ఉదయం ఒక ప్రైవేట్ పాఠశాల పైకప్పు కూలిపోవడంతో 34 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయుడు మరణించారు. మరో 19 మంది చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. పెషావర్ నగరంలో రద్దీగా ఉండే దిర్ కాలనీలో ఒక విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే అల్–ఖైర్ పాఠశాల మూడు అంతస్తుల భవనంలో ఈ ఘటన జరిగిందని పెషావర్ నగర పోలీస్ చీఫ్ మియాన్ సయీద్ తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే పోలీసు బృందం అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయని, అయితే భవనం ఇరుకైన వీధుల్లో ఉండటం వల్ల సహాయక చర్యలు కష్టంగా మారాయని తెలిపారు. సహాయక చర్యల్లో పాకిస్థాన్ సైన్యం, ఇతర సహాయక– పునరావాస సంస్థలు కూడా చురుగ్గా పాల్గొన్నాయి. రెండవ, మూడవ తరగతి పిల్లలు తమ ఉపాధ్యాయులతో కలిసి తరగతి గదులలో ఉన్నప్పుడు గదుల పైకప్పులు కూలిపోయాయని పోలీస్ చీఫ్ తెలిపారు. పైకప్పు కూలిపోయినప్పుడు పై అంతస్తులోని తరగతి గదుల్లోనే ముప్పై మంది విద్యార్థులు ఉన్నారని, మృతులు, గాయపడిన విద్యార్థులంతా ఆరు నుంచి 13 ఏళ్ల లోపు వారేనని అన్నారు. విద్యా ట్రస్టు యజమానిని అరెస్టు చేశామని, మూడు అంతస్తుల భవనం నాసిరకంగా నిర్మించారని తెలిపారు. ఈ ప్రమాదం గురించి పెషావర్ లోని లేడీ రీడింగ్ హాస్పిటల్ ప్రతినిధి ముహమ్మద్ అసిమ్ మీడియాతో మాట్లాడారు. తమ ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చేసరికే 32 మంది పిల్లలు, ఒక టీచర్ మృతి చెందారని చెప్పారు. గాయపడిన 19 మందికి చికిత్స కొనసాగుతోందని అన్నారు. చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిని ప్రకటించినట్లు చెప్పారు. మరో రెండు మృతదేహాలను నగరంలోని నసీరుల్లా ఖాన్ బాబర్ మెమోరియల్ ఆసుపత్రికి తరలించారు.

## కలాం ఆశయాలతో వికసిత భారత్ నిర్మాణానికి కృషి చేయాలి

- యువత పెద్ద కలలు కని.. వాటిని సాకారం చేసుకోవాలి
- భవానీపురంలో అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్




**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో యువత ముందుకు సాగాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. కలాం కలలుగన్న వికసిత భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని కోరారు.

విజయవాడ భవానీపురంలోని హెచ్‌ఓ కన్వెన్షన్‌లో రైట్ కంప్యూటర్స్, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కలాం 95వ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీవీఎన్ మాధవ్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలు, శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన కృషి, యువతకు అందించిన స్ఫూర్తిదాయక సందేశాలను గుర్తు చేసుకున్నారు.

**యువతే దేశానికి గొప్ప సంపద**

బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ బాషా మాట్లాడుతూ యువత దేశానికి గొప్ప సంపద అని కలాం విశ్వసించేవారని తెలిపారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని ఆయన సూచించారని పేర్కొన్నారు. విద్య, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు.

భాజపా జాతీయ మైనారిటీ మోర్చా సోషల్ మీడియా కో–కన్వీనర్ జస్వంత్ జైన్ మాట్లాడుతూ కలాం జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కలాం కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత తమ ప్రతిభ, జ్ఞానాన్ని దేశ ప్రగతికి వినియోగించాలని సూచించారు.

కలాం ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లవచ్చని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర మీడియా కన్వీనర్ కిలారు దిలీప్, జంపని నిజాముద్దీన్ బాబా, ఎన్టీఆర్ జిల్లా మైనారిటీ మోర్చా ఇన్‌చార్జి దుర్భసుల హుస్సేన్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మీరావలి తదితరులు పాల్గొన్నారు. మైనారిటీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## బ్రహ్మంగారిమఠం జడ్పీటీసీ బరిలో నిలిచేందుకు ముండ్లపాటి చంద్రశేఖర్ ఆసక్తి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముండ్లపాటి చంద్రశేఖర్ ఆసక్తి చూపుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించి, అభ్యర్థిగా ఎంపిక చేస్తే ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో బ్రహ్మంగారిమఠం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఎలాంటి రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా పోటీ చేసిన చంద్రశేఖర్ 682 ఓట్లు సాధించారు. పార్టీ అండదండలు లేకుండానే సొంతంగా ఎన్నికల బరిలో నిలిచి ఈ స్థాయిలో ఓట్లు సాధించడం ఆయన రాజకీయ ఆసక్తికి, స్థానికంగా ప్రజలతో ఉన్న పరిచయాలకు సంబంధించిన ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది.

విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన చంద్రశేఖర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. అనేకమంది విద్యార్థులకు విద్యాబోధనలో మార్గదర్శకత్వం వహించారు. సౌమ్య స్వభావం, నిరాడంబరతతో పాటు అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా మండల ప్రజలకు పరిచయమయ్యారు. నిరుద్యోగ యువతకు వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేయడంతో పాటు, పాత్రికేయుడిగా కూడా సేవలందిస్తున్నారు.

జడ్పీటీసీగా అవకాశం లభిస్తే బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని 11 పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నది తన ఆకాంక్షగా చంద్రశేఖర్ పేర్కొంటున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారానికి నిరంతరం ప్రయత్నించడం తన ప్రాధాన్యాలుగా ఉంటాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. పార్టీ సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో కార్యకర్తల సహకారంతో సమన్వయం, ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలనుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేయడమే ప్రజాప్రతినిధి ప్రధాన కర్తవ్యమని ఆయన అభిప్రాయపడుతున్నారు.

తన అభ్యర్థన ఎవరికీ వ్యతిరేకంగా కాదని, ప్రజాసేవ చేయాలన్న ఆకాంక్షతోనే పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజల మద్దతు కోరుతున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తానని, అవకాశం లభిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు.

గతంలో సర్పంచ్ అభ్యర్థిగా స్వతంత్రంగా పోటీ చేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం జడ్పీటీసీ అభ్యర్థిత్వంపై ఆయన వ్యక్తం చేస్తున్న ఆసక్తి స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే తెలుగుదేశం పార్టీ తరఫున ఆయన అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది.

## ఘనంగా వై.యస్.ఆర్.సిపి కార్యాలయ ప్రారంభోత్సవం

- స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం
- మండలంలో పార్టీ జెండా ఎగరేస్తాం: మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- స్థానిక సంస్థ ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీని ఓడిస్తాం ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్
- కార్యకర్తల సంక్షేమమే వైసీపీ లక్ష్యం- పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు నియోజకవర్గంలోని బి.మఠం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్,నియోజకవర్గ పరిశీలకులు రాజగోపాల్ రెడ్డి బి.మఠం మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నెలటూరు సుబ్బారెడ్డి రాష్ట్ర నాయకులు తదితరులు హాజరయ్యారు.

స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం – మండలంలో పార్టీ జెండా ఎగరేస్తాం:మాజీ మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి,జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ ధీమా

మైదుకూరు నియోజకవర్గంలోని బి.మఠం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ,ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్,నియోజకవర్గ పరిశీలకులు రాజగోపాల్ రెడ్డి బి.మఠం మండల కన్వీనర్ మేకల రత్న కుమార్,జిల్లా పార్టీ ఉపదక్షులు నెలటూరు సుబ్బారెడ్డి,రాష్ట్ర నాయకులు, తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యాలయాలు ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిగా నిలవాలని, స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

రానున్న స్థానిక ఎన్నికల్లో బి.మఠం మండలంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందనే ధీమాను నాయకులు వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కృషి, పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసమే తమ విజయానికి పునాది అని పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారుబి పార్టీ కార్యాలయాన్ని నాయకులు ప్రారంభించి, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యాలయాలు ప్రజలకు పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిగా నిలవాలని, స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

రానున్న స్థానిక ఎన్నికల్లో బి.మఠం మండలంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందనే ధీమాను నాయకులు వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కృషి, పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసమే తమ విజయానికి పునాది అని పేర్కొన్నారు.బి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డేటా ట్రాఫిక్‌లో 60 శాతం వాటా జియోదే: ఆకాశ్ అంబానీ

**ముంబయి:** దేశంలోని మొత్తం వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 60 శాతం వాటా జియోదేనని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. 2031 ఆర్థిక సంవత్సరం నాటికి భారతదేశంలో 1.4 ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుందని ఆశిస్తున్నామన్నారు. అందులో తాము అతిపెద్ద మార్కెట్ వాటా సాధిస్తామని ఆకాంక్షించారు. జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఐపీఓ వేళ ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

జియోకు 2026 జూన్ 30 నాటికి 53.3 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారని ఆకాశ్ అంబానీ తెలిపారు. ఇందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లని పేర్కొన్నారు. చైనా వెలుపల ఈ స్థాయిలో కస్టమర్ బేస్ కలిగిన అతిపెద్ద కంపెనీ జియో అని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి నెలవారీ సగటు డేటా వినియోగం 43.7జీబీకి చేరిందని తెలిపారు. జియోకు ప్రస్తుతం 3,60,537 టవర్లు ఉన్నాయని, 26,800 వీఎంట స్పెక్ట్రమ్ కలిగి ఉందని చెప్పారు. 2025-26 నాటికి 2.8 కోట్ల హోమ్ బ్రాండ్ కస్టమర్లను జియో కలిగి ఉందని తెలిపారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.76,225 కోట్లుగా ఉందని ఆకాశ్ అంబానీ తెలిపారు. 2024-26 ఆర్థిక సంవత్సరాల మధ్య 17.8 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. 2016లో జియో మార్కెట్‌లోకి ప్రవేశించిందని తెలిపారు. అప్పట్లో సగటు డౌన్‌లోడ్ వేగం 2.5 ఎంబీపీఎస్ మాత్రమేనని చెప్పారు. ప్రస్తుతం జాతీయ సగటు 68 ఎంబీపీఎస్‌గా ఉందన్నారు.

## కూటమి విజయానికి సమన్వయంతో పనిచేయాలి



- స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి కృషి అవసరం : ఎంపీ భాష్యం రామకృష్ణ

**నరసాపురం, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ పిలుపునిచ్చారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన కూటమి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

సమావేశంలో నరసాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, బీజేపీ నాయకులు, కూటమి ముఖ్య నాయకులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

పార్లమెంట్ పరిధిలోని ప్రతి మున్సిపాలిటీ, మండలం, గ్రామ పంచాయతీలో కూటమి అభ్యర్థుల విజయానికి అవసరమైన వ్యూహాలను రూపొందించాలని నాయకులకు సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు కూటమి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని భాష్యం రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజల మద్దతు, కార్యకర్తల సమష్టి కృషితో నరసాపురం పార్లమెంట్ పరిధిలో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## మత పెద్దలకు నాడు అడుగడుగునా వేధింపులు.. నేడు సమూల గౌరవం

- ఇమామ్, మౌజమ్ లకు ఆర్థిక భరోసా ఇచ్చింది కూటమి ప్రభుత్వమే
- మైనార్టీల సంక్షేమం మాటాల్లో కాదు చేతల్లో చూపిన సీఎం చంద్రబాబు గారు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్



**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** మత విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ అన్ని మతాలను సమాన దృష్టితో చూసిన ఏకైక సీఎం నారా చంద్రబాబు నాయుడు గారు ఒక్కరే అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ కొనియాడారు. జగన్ రెడ్డి హయంలో మతపెద్దలకు వేధింపులు నిత్యకృత్యమైతే నేడు వారికి అన్ని విధాలుగా అడంగా నిలుస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. అరకొర నిధులతో నాడు మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్లకు జగన్ రెడ్డి మొండి చేయి చూపితే నేడు సకాలంలో నిధులు విడుదల చేస్తున్నామన్నారు. తాజాగా ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతనం కింద రూ. 22.50 కోట్లు విడుదల చేసి ఆర్థిక చేయూత కల్పించమన్నారు. గత 27 నెలలకు కలిపి ఇప్పటివరకు రూ. 202 కోట్ల గౌరవ వేతనాన్ని విడుదల చేశామన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

" గత వైసీపీ పాలనలో మైనార్టీలంటే చిన్నచూపు ఉండేది. ముస్లింలపై దాడులు నిత్యకృత్యంగా మారేవి. వైసీపీ ఐదేళ్ల కాలంలోనే అబ్దుల్ సలాం, మిస్బా ఫాతిమా ఇలా అనేక మంది హత్యకు గురైయ్యారు. ముస్లిం సామాజిక వర్గానికి వర్తించే పది పథకాలు వరకు రద్దు చేశారు. 30వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను వైసీపీ నాయకులు కబ్జా చేశారు. ఇలా అనేక అరాచకాలను దాటుకుని కూటమి ప్రభుత్వం 2024లో అధికారం చేపట్టింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లీం మత విశ్వాసాలను కాపాడుతూ బడ్జెట్ లో రెండేళ్లలో రూ. 16,147.23 కోట్లు కేటాయింపులు చేసి రూ. 10వేల కోట్లు ఖర్చు చేశాం. హజ్ యాత్ర చేస్తున్న ప్రతి ముస్లింకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నాం. వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని వైసీపీ ప్రభుత్వం వివాదాల్లోకి నెట్టితే వాటిని ముస్లిం సంక్షేమానికే ఉపయోగిస్తున్నాం. రాజధాని అమరావతిలో ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ తో పాటుగా హజ్ హౌస్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉర్దూ అకాడమీకి రూ. 10 కోట్లు మంజూరు చేశాం. అంతే కాకుండా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్స్, దీపం, స్త్రీ శక్తి వంటి పథకాలతో వెనుకబడిన మైనార్టీ ప్రజల జీవితంలో వెలుగులు తీసుకొస్తున్నాం." అని తెలిపారు.

## నేడు 'లెహ్రా దో తిరంగా'

**న్యూఢిల్లీ :** సిజెపి ఆధ్వర్యంలో గురువారం లెహ్రా దో తిరంగా ఆందోళన కార్యక్రమంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితులతోనైనా అడ్డుకోవాలని బిజెపి ప్రభుత్వాలు గట్టి ప్రయత్నిస్తున్నాయి. కన్నాట్ ప్లేస్ వద్ద ఉన్న సెంట్రల్ పార్క్‌లో లెహ్రా దో తిరంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిజెపి జాతీయ కన్వీనర్ అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. దీనికోసం కార్యకర్తలు, దేశభక్తులు జాతీయ జెండాలతో రావాలని దీప్కే పిలుపునిచ్చారు. మరోవైపు ఢిల్లీ పోలీసుల హామీతో ఈ నిరసనను నిరోధించడానికి ఢిల్లీ హైకోర్టు గురువారం నిరాకరించింది. ఈ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి ఆందోళన తలెత్తకుండా, ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ హామీని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. సిజెపి నిరసనను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని వ్యాపార సంఘం పలికా బజార్ వ్యాపారులు వేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. హైకోర్టు నిర్ణయానికి కొన్ని నిమిషాల తరువాత కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌ను రెండు రోజుల పాటు మూసి వేస్తూ న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ తీసుకుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో బిజెపి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. పరిపాలనా కారణాలతో ఈ నెల 16, 17 తేదీలలో సెంట్రల్ పార్క్‌ను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అధికారులు ఎలా చెప్పినా సిజెపి త్రివర్ణ పతాక యాత్ర నేపథ్యంలో సెంట్రల్ పార్క్‌ను మూసివేసే నిర్ణయం తీసుకున్నట్లు విమర్శకులు భావిస్తున్నారు. మరోవైపు గురువారం సాయంత్రం నుంచే కన్నాట్ ప్లేస్, జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఢిల్లీ పోలీసులతో పాటు , పలు పారామిలిటరీ బలగాల కంపెనీలను మోహరించారు. భారీగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సెంట్రల్ పార్కును మూసివేశారు, కాబట్టి నిరసనకారులు ఇటువైపు రావొద్దని పోలీసు అధికారులు ప్రకటించారు. కాగా, పలికా బజార్ వ్యాపారులు తమ పిటిషన్‌లో సిజెపి ఆందోళన వల్ల తమ వ్యాపారం దెబ్బ తింటుందని, తాము భారీగా నష్టపోతున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని, పోలీసులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# అమ్మే మృత్యువై తోసేస్తే.. ఆపద్బాంధవులై కాపాడారు..

- సాగర్‌లో మునిగిపోతున్న ఆరేళ్ల పసిపాపను రక్షించిన ముగ్గురు పౌరులు..
- ప్రాణదాతలకు నగర సీపీ సజ్జనర్ ఘన సత్కారం, నగదు పురస్కారం..

**హైదరాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** హుస్సేన్ సాగర్‌లో మునిగిపోతున్న ఆరేళ్ల చిన్నారిని కాపాడిన ముగ్గురు పౌరులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆపదలో ఉన్న చిన్నారికి తక్షణమే ఆపన్నహస్తం అందించి ప్రాణదాతలుగా నిలిచిన ఆటో డ్రైవర్ ఫక్రుద్దీన్, ప్రైవేటు ఉద్యోగి కె.బాలకృష్ణ, వ్యాపారి మహ్మద్ అఫ్సర్‌లకు శాలువాలు కప్పి, నగదు పురస్కారాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. బోయిన్‌పల్లికి చెందిన ఓ మహిళకు ఎనిమిదేళ్లు, ఆరేళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆరేళ్ల చిన్నారి గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, రోజురోజుకూ పెరిగిపోతున్న చికిత్స ఖర్చులను భరించలేక తీవ్ర నిస్సహాయత, మానసిక క్షోభకు లోనైన తల్లి విచక్షణ కోల్పోయింది. కన్న కూతురిని చంపేయాలనే కర్కశ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు పిల్లలను అప్పర్ ట్యాంక్‌బండ్‌కు తీసుకొచ్చిన ఆమె, ఐస్‌క్రీమ్ తీసుకు రావాలని పెద్ద కుమార్తెను పక్కకు పంపించింది. అనంతరం ఎవరూ గమనించని సమయంలో అనారోగ్యంతో ఉన్న ఆరేళ్ల చిన్నారిని హుస్సేన్‌సాగర్‌లోకి తోసేసి అక్కడి నుంచి పరారైంది. నీటిలో పడిన చిన్నారి అక్కడున్న వెదురు కర్రను పట్టుకుని ప్రాణభయంతో 'కాపాడండి. మా అమ్మ నన్ను నీటిలో తోసేసింది.' అంటూ కేకలు వేసింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న బోరబండ మోతీనగర్‌కు చెందిన కె.బాలకృష్ణ చిన్నారి ఆర్తనాదాలను మొదటగా గమనించి రోడ్డుపై వెళ్లేవారిని కేకలు వేస్తూ అప్రమత్తం చేశారు. సరిగ్గా అదే సమయంలో అప్పర్ ట్యాంక్‌బండ్ మీదుగా వెళ్తున్న బేగంపేట ప్రకాశ్ నగర్ నివాసి ఆటో డ్రైవర్ ఫక్రుద్దీన్, అక్కడ రద్దీని చూసి వాహనాన్ని నిలిపివేశారు. నీటిలో మునిగిపోతున్న చిన్నారిని చూడగానే ఆయన క్షణాల్లో నీటిలోకి దూకారు. నాచారానికి చెందిన మహ్మద్ అఫ్సర్ సహాయంతో ఆ పాపను నీటిలోంచి పైకి తీసుకొచ్చి రోడ్డుపైకి చేర్చారు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తల్లిపై దోమలగూడ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగర సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న తోటి మనిషిని చూసి సాయం చేయాల్సింది పోయి, చేతుల్లోని మొబైల్ ఫోన్లలో వీడియోలు తీస్తూ ఉండిపోయే రోజుల్లో.. ఈ ముగ్గురు పౌరులు ప్రదర్శించిన తెగువ, సమయస్ఫూర్తి సమాజానికే ఆదర్శమని కొనియాడారు. బాలకృష్ణ అప్రమత్తం చేయడం, ఫక్రుద్దీన్, మహ్మద్ అఫ్సర్ నీటిలోకి దూకి ఆ పసిపాపను కాపాడిన తీరు అత్యంత ప్రశంసనీయమని, ఇలాంటి సామాజిక బాధ్యతను, మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "పిల్లల అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తల్లిదండ్రులకు ఎంతటి మానసిక భారాన్ని తెచ్చినప్పటికీ.. నిస్సహాయతతో కన్నబిడ్డల ప్రాణాలు తీయడం పరిష్కారం కాదు. కష్టమొచ్చినప్పుడు నైరాశ్యంతో చేతులెత్తేయకుండా.. సమాజం, ప్రభుత్వ వ్యవస్థల సహాయం కోరాలే తప్ప ఇలాంటి కర్కశ నిర్ణయాలు తీసుకోకూడదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి సమాజం ఎప్పుడూ ముందుంటుంది. ప్రాణాల కంటే ఏదీ విలువైనది కాదు" అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, అదనపు సీపీ (క్రైమ్స్) ఎం. శ్రీనివాసులు, ఐపీఎస్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, ఐపీఎస్, సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితా కృష్ణమూర్తి, ఐపీఎస్ గాంధీనగర్ ఏసీపీ యాదగిరి, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ అంజద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో బీజేపీ ఎన్నికల సమర సన్నద్ధత..

- అర్హులైన పట్టభద్రులంతా బాధ్యతగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి
- పట్టభద్రుల ఓటరు నమోదుపై అంజిరెడ్డి దిశానిర్దేశం!
- నిరుద్యోగుల హక్కుల సాధనకు బీజేపీ పోరాటం
- జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్

**యాదగిరిగుట్ట, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ సి.హెచ్. అంజిరెడ్డి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ సారథ్యంలో బుధవారం యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యశాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి పార్టీ శ్రేణులకు, పట్టభద్రులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో పట్టభద్రులు అత్యంత చైతన్యవంతమైన వర్గమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. యువత ఆశలను వమ్ము చేస్తూ నిరుద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి, అర్హులైన పట్టభద్రులతో ఓటరు నమోదు దరఖాస్తులు పూర్తి చేయించాలని, ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు.

**నిరుద్యోగుల హక్కుల కోసం బీజేపీ పోరాటం :** జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు న్యాయం జరగాలన్నా, పట్టభద్రుల సమస్యలు పరిష్కారం కావాలన్నా వారి గొంతుక శాసనమండలిలో బలంగా వినిపించాల్సిన అవసరం ఉందన్నారు.

అందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల మురళీధర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్, పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాదూరి అచ్చయ్య, చందా మహేందర్, కొప్పుల యాదిరెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా మీడియా కన్వీనర్ రామకృష్ణ, కార్యాలయ కార్యదర్శి మంగు నరసింహారావు, వివిధ మోర్చాల అధ్యక్షులు దయ్యాల కుమార్, రామ్ చందర్, చెర్క వెంకటేష్, కస్తూరి మాధురి చంద్ర, మండలాల అధ్యక్షులు కర్రె ప్రవీణ్, రత్నపురం బలరాం, శీర్కా సురేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి బాటలు

- శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి ఉద్యోగావకాశాలు కల్పించాలి..
- వెల్లడించిన కలెక్టర్ అనురాగ్ జయంతి..

**యాదగిరిగుట్ట, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం యాదగిరిగుట్టలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ కోర్సులు, శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థుల హాజరు, బోధనా విధానం, ప్రాక్టికల్ శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, అభ్యర్థుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేసే ప్రక్రియ, తదనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. శిక్షణ కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, అభ్యర్థులకు నిర్వహిస్తున్న పరీక్షల ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు. యువతలో ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అను గుణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగాలు లభించేలా సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ధనంజనేయులు, తహసీల్దార్ గణేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబాన్ని పరామర్శ!

- 50 కేజీల బియ్యం అందజేసిన కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు



**ఏటూరునాగారం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళవారం మంత్రివర్యులు సీతక్క ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు పైడకుల అశోక్ సూచనల మేరకు కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు సునార్కని రాంబాబు తండ్రి (సునార్కని ఇస్తారి 70) ఇటీవల గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా, వెంటనే తెలుసుకున్న కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు మృతుడి స్వ స్థలం చింతగూడెం గ్రామానికి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి రేపు వారి పెద్దకర్మ ఉండగా 50 కేజీల బియ్యం పెద్దకర్మ ఖర్చులకు 6000 రూపాయలు నగదు ఇచ్చి వారికీ వారి కుటుంబానికి ఎటువంటి కష్టాలలోనైనా కాంగ్రేస్ పార్టీ అండగా ఉటుందనీ అని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు (సర్పంచ్) జాడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ, అప్సర్ పాషా,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు తాటి రాజబాబు, జిల్లా కార్యదర్శి బొల్లె భాస్కర్, మండల కో ఆర్డినేటర్ దుర్గం ప్రభాకర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చేర్ప పగిడయ్య,చింతగూడెం మాజీ ఉప సర్పంచ్ జంగా కృష్ణ,సర్పంచ్ పోడెం నర్సింహారావు,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలం రాంబాబు,పిరీల ప్రేమ్, గోస్కుల నర్సింహా,లాలయ్య, భద్రయ్య, యూత్ నాయకులు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి నుంచి సింగరేణి గర్జనకు మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్...



**బెల్లంపల్లి అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నుండి బారి కాన్వాయ్ తో బయలుదేరిన మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణి కుంట్ల ప్రవీణ్... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు లాభాల వాటా ఇయ్యడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తూ కార్మికుల హక్కుల ను కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్నాయి, కార్మికుల హక్కుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాలపై సింగరేణి కార్మికుల కోసం సింగరేణి గర్జన బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, అన్నారు.

## పత్తి రామచంద్రయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ..

- మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యాన్ని నింపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..

**ఏటూరునాగారం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పత్తి ప్రకాశం,పత్తి వెంకటేష్‌ల తండ్రి పత్తి రామచంద్రయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి పత్తి రామచంద్రయ్య పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అండగా ఉంటారని భరోసా కల్పిస్తూ,కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు.ఈ పరామర్శలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఎంపెల్లి సమ్మయ్య,ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, నాయకులు గడ్డం శ్రీహరి,జంగం భానుచందర్,పల్లె శోభన్,గడ్డం పరమేష్,పన్నాల కొండల్ రెడ్డి,రాచకొండ సోమయ్య, ధర్మారపు యాకయ్య,పగిడిపెల్లి రవి,ధార ధర్మయ్య, అక్కిపెల్లి మధు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పూల పండుగ బతుకమ్మ..

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక..
- వెల్లడించిన సైబరాబాద్ సీపీ డా.యం. రమేష్




**సైబరాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రకృతికి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ నిలయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.యం.రమేష్ పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మకు తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో సీపీ రమేష్ పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలాడుతూ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ ఆత్మ గౌరవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్ డీసీపీ పుష్ప, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, షీ టీమ్స్ డీసీపీ సృజన, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏవో జ్యోతిర్మయి, పోలీసు అధికారులు, కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు..

- యాదగిరిగుట్టలో వైభవంగా శ్రీదేవీ నవరాత్రోత్సవాలు..
- ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు



**యాదగిరిగుట్ట, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన అనుబంధ ఆలయమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగవ రోజు పర్వతవర్ధిని అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో పాటు పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపాలు, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం శ్రీదేవి చతుషష్టి ఉపచార పూజ,నీరాజనం, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నవావరణ పూజలు, కుంకుమార్చనలు,మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవీ నవరాత్రోత్సవాల ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు నరసింహమూర్తి, అర్చకులు సాయికృష్ణ శర్మ, అధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌడ యువజన సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మేకల శివ గౌడ్ నియామకం..

- గౌడ జాతి హక్కులకోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ..



**చిట్యాల, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ గౌడ యువజన సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిట్యాల పట్టణానికి చెందిన మేకల శివ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీజీవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ మేకల శివ గౌడ్‌కు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేకల శివ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ గారికి, రాష్ట్ర కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కల్లు గీత కార్మికుల సంక్షేమం, గౌడ జాతి అభివృద్ధి, గౌడన్నల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం మరియు గౌడ జాతి ఆత్మగౌరవం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గౌడ యువతను సంఘటితం చేస్తూ, గౌడ జాతి హక్కుల సాధనకు, గీత కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని మేకల శివ గౌడ్ స్పష్టం చేశారు.

## పాంచజన్యాన్ని జనాల్లోకి తీసుకెళ్ళాలి..

- పిలుపునిచ్చిన టి.ఆర్.ఎస్. చీఫ్ కవిత..
- చందానగర్‌లో ముఖ్యనాయకుల సమావేశం..
- పాల్గొని ప్రసంగించిన కల్వకుంట్ల కవిత..



**హైదరాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** చందానగర్‌లో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అధ్య క్షులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్ ఛార్జీలు, ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని నాయకులకు దిశా నిర్దేశం చేశారు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత.. గ్రేటర్ హైదరాబాద్, సైబరా బాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని పార్టీ నాయకులకు సూచించిన పార్టీ చీఫ్.. పార్టీ ప్రధాన సిద్ధాంతం పాంచజన్యంను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు కవిత..

## అనంతగిరి బస్సు ప్రమాదంలో మరో మహిళ మృతి





**వికారాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** అక్టోబర్ 3న అనంతగిరి చివరి మలుపుల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటికే నలుగురు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరు మండలం, కేసారం గ్రామానికి చెందిన అత్తిలి లావణ్య (45) గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

# శారీరక ఆరోగ్యంతో పాటే మానసిక ఆరోగ్యమూ ముఖ్యం : డీఎంహెచ్ఓ డా. డి. రామారావు

- ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు – మానసిక సమస్యలపై అవగాహన ప్రతిజ్ఞ



**ఖమ్మం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా అత్యంత కీలకమని, జిల్లా ప్రజలంతా మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ డి. రామారావు పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ఐ డి ఓ సి జిల్లా కార్యాలయంలో అధికారులతో కలిసి మానసిక ఆరోగ్యంపై ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది "మానసిక ఆరోగ్యం - సార్వత్రిక మానవ హక్కు" అనే నినాదంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఆరోగ్యం అంటే కేవలం ఎలాంటి వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పని సామర్థ్యంతో సమాజ శ్రేయస్సుకు తోడ్పడటమే అసలైన మానసిక ఆరోగ్యమని వివరించారు.మానసిక సమస్యల ప్రధాన లక్షణాలు: నిరంతరం తీవ్రమైన విచారం, ఆందోళన లేదా భయం వెంటాడటం నిద్రలేమి లేదా అతిగా నిద్రపోవడం ఆకలి మందగించడం, రోజువారీ పనులపై ఆసక్తి లేకపోవడం తీవ్రమైన కోపం, చిరాకు మరియు అసహనం పెరగడం మత్తు పదార్థాలకు, ఆల్కహాల్‌కు బానిస కావడం ఆత్మహత్య ఆలోచనలు రావడంమానసిక ఆరోగ్య పరిరక్షణకు మార్గాలు: మనసు విప్పి మాట్లాడండి: బాధ, ఒత్తిడి కలిగినప్పుడు మౌనంగా ఉండకుండా కుటుంబ సభ్యులు, ఆత్మీయులు లేదా స్నేహితులతో పంచుకోండి. ఆరోగ్యకరమైన జీవనశైలి: రోజుకు 7 నుండి 8 గంటల ప్రశాంతమైన నిద్ర, సమతుల్య పౌష్టికాహారం, నిత్యం 30 నిమిషాల పాటు వ్యాయామం, యోగా లేదా ధ్యానం అలవర్చుకోండి. మొబైల్, మత్తుకు దూరం: స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా వాడకాన్ని నియంత్రించుకోండి. మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి. సానుకూల దృక్పథం: ఇష్టమైన పనులకు సమయం కేటాయిస్తూ, ప్రకృతి ఒడిలో గడపడం ద్వారా మనశ్శాంతిని పొందండి. అపోహలు వీడండి: మానసిక సమస్య అనేది బలహీనత కాదు; ఇది జ్వరం, మధుమేహం (షుగర్) లాంటి ఒక సాధారణ ఆరోగ్య సమస్య మాత్రమే. దీనికి శాస్త్రీయ చికిత్స అందుబాటులో ఉంది.జిల్లాలో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలు: ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మానసిక వైద్య నిపుణులు (సైకియాట్రిస్ట్) అందుబాటులో ఉన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో (పిహెచ్ సి / యుపిహెచ్ సి ) టెలి-మానస్ ద్వారా కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. టెలి-మానస్ ఉచిత హెల్ప్‌లైన్: 14416 (24 గంటలు అందుబాటులో ఉంటుంది) ఆరోగ్య సమాచారం కోసం: 104 హెల్ప్‌లైన్ఎవరికైనా మానసిక ఒత్తిడి లేదా ఆత్మహత్య ఆలోచనలు వస్తే తక్షణమే సమీప వైద్యులను లేదా టెలి-మానస్ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. "మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుందాం – ఆనందకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ అరుణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సోహెల్, పరిపాలనాధికారి (ఏఓ) మమత, డెమో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డెమో కె.వి. రాజు, డిపిహెచ్ఎన్ఓ శేషు పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు వేణుగోపాల్, ఖాదర్ బి, గీత, డిపిఎంఓ కృష్ణ, హెచ్ఈఓలు పుల్లయ్య, సత్యనారాయణ, నరేంద్ర చారి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్ నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **1,58,144** మంది ఓటర్ల విచారణ పూర్తి
- ఫారం-6 పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎస్ఐఆర్ **2026**, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు.మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఫారం-6 దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి**

జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు.నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు.

**మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ. సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జెసి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





**ఖమ్మం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
తెలంగాణా సాంప్రదాయానికి చిహ్నం బతుకమ్మ పండుగ అని యస్.బి.ఐ.టి., ఆర్జెసికళాశాల ల ఛైర్మన్ గుండాల కృష్ణ అన్నారు.బుధవారం కళాశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా ఊరు వాడలలో బతుకమ్మ వేడుకులను నిర్వహిస్తామని, చిన్న పెద్ద తేడా లేకుండా రాష్ట్ర పండుగలా జరుపుకుంటామని తెలిపారు. తెలంగాణా పూల పండుగగా పిలుచుకొనే బతుకమ్మ పండుగను విద్యార్థుల సమక్షంలో జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందని అన్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ పేర్లతో నిర్వహించే ఈ వేడుకలకు వివిధ ప్రాంతాలలో వివిధ కథలతో ముడిపడి ఉందని, చరిత్ర ఏదైనా వేడుకలను నిర్వహించడంలో శాస్త్రీయ కోణం కూడా లేకపోలేదని అన్నారు. భావితరాలు తమ తెలంగాణా సాంప్రదాయ మూలాలు మరిచిపోకుండా ఇటువంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు. టెక్నాలజీల వెంట పరిగెత్తె ఈ రోజులలో ఇటువంటి పండుగలు సాంప్రదాయాన్ని, విలువలను గుర్తు చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో హో రెత్తించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుండాల కవిత,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య,ఇంటర్ కళాశాల ఇన్చార్జి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

# దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులు : జిల్లా విద్యాశాఖాధికారిణి వాసంతి

**ఖమ్మం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, సాధారణ ప్రజల సౌకర్యార్థం ఈ దసరా సెలవుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి డి. వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విద్యాధికారిణి తెలిపారు.ఈ ప్రత్యేక క్యాంపులలో నూతన ఆధార్ నమోదుతో పాటు, విద్యార్థులకు అత్యంత కీలకమైన పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు, సాధారణ ప్రజలకు అవసరమైన ఇతర ఆధార్ సేవలు అందించబడతాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ, పెండింగ్ బయోమెట్రిక్ అప్‌డేట్లు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని చేరవేసి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారిణి ఆదేశించారు.ఆధార్ సేవల కొరకు యుఐడిఎఐ నిర్ణయించిన ప్రామాణిక నిబంధనల ప్రకారమే రుసుములు వసూలు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి హెచ్చరించారు. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ ప్రజలందరూ తమ సమీపంలోని మండల వనరుల కేంద్రం లేదా కేటాయించిన జూనియర్ కళాశాలల్లో సంప్రదించి ఈ దసరా సెలవుల్లో ఆధార్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం పరామర్శ



**ఖమ్మం, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణంను ఖమ్మంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు ప రామ ర్శించారు. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎంఎల్సీ తాతా మధుసూదన్, మాజీ ఖమ్మం నగర పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ రూరల్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్ ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాగభూషణం త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి పార్టీ కార్యక్రమాల్లో, ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎంఎల్సీ తాతా మధుసూదన్ ఆకాంక్షించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# గ్రామసేవకు కేటీఆర్ ప్రశంసలు..

## కొండారెడ్డిపల్లి ప్రేమ్ కుమార్ గౌడ్‌కు అభినందనలు



**కేశంపేట, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. షాద్‌నగర్ నియోజకవర్గ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్‌తో కలిసి కొండారెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన కానం ప్రేమ్ కుమార్ గౌడ్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొండారెడ్డిపల్లి గ్రామంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సహకారం, గ్రామాభివృద్ధి కోసం చేస్తున్న కృషి గురించి కేటీఆర్‌కు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గ్రామస్థుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమని కేటీఆర్ ప్రశంసించినట్లు ప్రేమ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు సాగడం సంతోషకరమని కేటీఆర్ అభినందించారు.కేటీఆర్‌తో జరిగిన భేటీ సంతోషాన్ని కలిగించిందని ప్రేమ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తన వంతు కృషి కొనసాగిస్తానని వెల్లడించారు.

# అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉప్పలమ్మ విగ్రహ ప్రతిష్ఠ..

- వైభవంగా హోమంకంతం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వేడుకలు.. పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు






**శామీర్‌పేట, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
అలియాబాద్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉప్పలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, హోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పూజలు, హోమాది క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించడంతో కార్యాలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.ఉప్పలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, గ్రామాభివృద్ధి, సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ప్రార్థించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు గాద వెంకటేష్, గుద వెంకటేష్, నాయకులు దినేష్, శ్యామ్, దామోదర్ రెడ్డి, బండి రామిరెడ్డి, మాధవరెడ్డి, వైల ఎల్లయ్య, గుద ఎల్లయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధి కొరకు స్పెషల్ ఫండ్ ఇవ్వాలి

- 26వ డివిజన్ లో భూమి పూజ చేసిన ఎమ్మెల్యే ధన్పాల్..



**నిజామాబాద్, అక్టోబరు 15(జర్నలిస్ట్ ఫైల్) :** నియోజకవర్గ అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ ఇవ్వాలని,ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని 26వ డివిజన్ లో చేపట్టే రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గత ఏడాది కార్పొరేషన్ లో పాలక వర్గం లేకపోవడం,కౌన్సిల్ సమావేశం జరగకపోవడంతో నిధులు లేవన్నారు.ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్ కు రూ.20 లక్షలు కేటాయించారన్నారు.వీటితో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.అలాగే ప్రతి డివిజన్ కు కోటి రూపాయల పనులు కూడా ప్రారంభమవుతున్నాయని తెలిపారు.అర్బన్ చాలెంజ్ ఫండ్,ఖిల్లా రామాలయంలో రోప్ వే కు డీపీఆర్ కూడా సిద్ధమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి,స్థానిక కార్పొరేటర్ బంటు రాము,బంటు ప్రీతి ప్రవీణ్,జ్యోతి మురళి,మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారి సన్నిధిలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్!

- రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు!



**కురవి, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
డోర్నకల్ నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామివారిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారి దర్శనం కలిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

➤ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలి!ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామివారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సంతోషం నిండాలని ప్రార్థించారు. కురవి పుణ్యక్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుండగా, ప్రముఖ నాయకుల స్వామివారి దర్శనం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

➤ ఒకే వేదికపై బీఆర్ఎస్ మహిళా నాయకులు, పార్టీ ముఖ్య నేతలు!ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కుమారి బిందు అంగోత్, మంత్రి శ్రీదేవి, కురవి సర్పంచ్ లక్ష్మీ రాజు నాయక్ పాల్గొన్నారు. అలాగే మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, పిచ్చి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పెద్ది వెంకన్న గౌడ్, ఐలి నరహరి గౌడ్, బొడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, సంగెమ్ భరత్, భద్రు, భోజ్య నాయక్, బాణోత్ శారద, కాంతి తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో నేహా వైష్ణవికి గోల్డ్ మెడల్

- నేషనల్స్ కి ఎంపికైన నిజామాబాద్ బిడ్డ




**నిజామాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిజామాబాద్ జిల్లాకు చెందిన కుడిత్యాల శోభ సంతోష్ ల కూతురు కె.నేహా వైష్ణవి ప్రస్తుతం 10వ తరగతి ప్రెసిడెన్సీ హై స్కూల్ లో చదువుతుంది.అండర్ 17 వికారాబాద్ లో జరిగిన 68 కేజి ల విభాగంలో స్టేట్ లెవెల్ టైక్వాండో పోటీలో 70 వ స్టేజ్ ఎస్ జి ఎఫ్ టైక్వాండో ఛాంపియన్షిప్లో గోల్డ్ మెడల్ సాధించి,నేషనల్స్ కి ఎన్నికయ్యారు.అంతేకాకుండా అక్టోబర్ 21 నుండి 27 వరకు జమ్మూకాశ్మీర్ లోని శ్రీనగర్ లో జరిగే నేషనల్ టైక్వాండో పోటీలలో కోచ్ వినోద్ మాస్టర్ తో పాల్గొననున్నారు.రాష్ట్రస్థాయిలో కె.నేహా వైష్ణవి గోల్డ్ మెడల్ అందుకున్న సందర్భంగా స్కూల్ యాజమాన్యం,తల్లిదండ్రులు,తోటి విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# బోనకల్ గ్రామపంచాయతీ కార్మికులకు యూనిఫామ్‌ల పంపిణీ

### కార్మికుల సేవలు గ్రామ అభివృద్ధిలో కీలకం — సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



**బోనకల్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రతను కాపాడటంలో, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు కార్మికులు నిత్యం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్మికులకు గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు వారికి అవసరమైన సదుపాయాలు అందించేందుకు గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, ప్రజల సహకారంతో బోనకల్‌ను పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో FCRA సంయుక్త పార్లమెంటరీ, వాణిజ్య కమిటీ సమావేశాల్లో పాల్గొన్న ఎంపీ అర్వింద్




**నిజామాబాద్, అక్టోబరు 15 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి న్యూఢిల్లీలో అక్టోబర్ 12,13 తేదీల్లో జరిగిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA) సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో,అలాగే అక్టోబర్ 14న జరిగిన వాణిజ్య కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

**FCRA సవరణ బిల్లుపై విస్తృత చర్చలు**

FCRA సవరణ బిల్లును సమగ్రంగా పరిశీలించేందుకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ,వాటి వినియోగంలో పారదర్శకత,జవాబుదారీతనం, చట్టపరమైన నిబంధనల అమలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది.అక్టోబర్ 12,13 తేదీల్లో జరిగిన సమావేశాల్లో వివిధ మత, సామాజిక, సేవా సంస్థల ప్రతినిధులు,చార్టర్డ్ అకౌంటెంట్లు,న్యాయ నిపుణులు, విద్యాసంస్థల ప్రతినిధుల నుంచి బిల్లుపై అభిప్రాయాలు,సూచనలను కమిటీ స్వీకరించింది.విదేశాల నుంచి అందే నిధులు చట్టబద్ధమైన మార్గాల్లో వినియోగించబడేలా చూడటం, నిధుల వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం,సంబంధిత సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలు ఈ సమావేశాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**వాణిజ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ**

అక్టోబర్ 14న న్యూఢిల్లీలో జరిగిన వాణిజ్య కమిటీ సమావేశంలోనూ ఎంపీ అర్వింద్ ధర్మపురి పాల్గొన్నారు. దేశ వాణిజ్య రంగ అభివృద్ధి,పారిశ్రామిక పురోగతి,ఎగుమతుల ప్రోత్సాహం,దేశీయ పరిశ్రమలకు అవకాశాల కల్పన,వాణిజ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై పార్లమెంటరీ కమిటీల ద్వారా జరిగే పరిశీలనలు,చర్చలు దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైనవి.పార్లమెంటరీ కమిటీల సభ్యుడిగా వివిధ రంగాలకు సంబంధించిన విధానపరమైన అంశాల పరిశీలనలో భాగస్వామ్యం కావడం ద్వారా ఎంపీ అర్వింద్ ధర్మపురి దేశ అభివృద్ధికి సంబంధించిన చర్చల్లో తన వంతు పాత్ర పోషిస్తున్నారు.ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విధానాల రూపకల్పనలో పారదర్శకత,జవాబుదారీతనం,సమర్థవంతమైన అమలు అత్యంత కీలకమని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు.పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో పాల్గొని,దేశ అభివృద్ధికి దోహదపడే విధానపరమైన చర్చల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

## ఎస్ఆర్ఎంను సందర్శించిన ఆస్ట్రేలియా బృందం



○ వీసీ, రిజిస్ట్రార్లతో సమావేశమై పరస్పర సహకారంపై చర్చ

**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** అస్ట్రేలియాలోని మెల్బోర్న్ యూనివర్సిటీ బృందం గురువారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని సందర్శించింది. మెల్బోర్న్ వర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫ్రాంక్ వెటేరీ తో కూడిన ఆరుగురు సభ్యులు ఎస్ఆర్ఎం వర్సిటీని చేరుకుని ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ తో సమావేశమయ్యారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఐఆర్హెచ్ఎస్ డైరెక్టర్ లక్ష్మీనరసింహన్ వీరికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వర్సిటీ బోర్డు రూమ్లో సమావేశమైన ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు గంట సేపు వివిధ అంశాలపై చర్చించుకున్నారు. అకడమిక్, రీసెర్చ్, ఫ్యాకల్టీలకు శిక్షణ వంటి కీలక విషయాల్లో సహకారం అవసమని మెల్బోర్న్ యూనివర్సిటీ ప్రో వైసాఛాన్సలర్ ప్రొఫెసర్ ఫ్రాంక్ పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమైన అంతర్జాతీయ విద్యాబోధన, పరిశోధనల విషయంలో ఎస్ఆర్ఎం భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ సతీష్కుమార్ యూనివర్సిటీ ప్రగతిని పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, ఐఆర్హెచ్ఎస్ డైరెక్టర్ లక్ష్మీనరసింహన్, డీన్లు సీవీ టామి, డాక్టర్ విష్ణుపథ్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక విప్లవ సారథి అబ్దుల్ కలాం : ఎమ్మెల్యే నసీర్

○ యువతకు ఆదర్శం కలాం జీవితం
○ మిస్సైల్ మ్యాన్ ఆశయాల సాధనకు కూటమి ప్రభుత్వం కృషి
○ కలాంకు నివాళులర్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** దేశ చరిత్రలోనే అత్యంత మహోన్నతమైన, కోట్లాది మంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఒక మహానాయకుడు భారతరత్న అబ్దుల్ కలాం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేదరికం నుండి విజ్ఞాన శిఖరాల వరకు తన జీవితాన్ని మలుచుకున్నారని తెలిపారు. చిన్నతనంలో కుటుంబానికి ఆసరాగా ఉండటానికి ఉదయాన్నే పేపర్ బాయ్ గా కూడా పని చేశారని చెప్పారు. ఆశయం ఉంటే జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు పేదరికం అడ్డుకాకూడదని నిరూపించారన్నారు. మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన కలాం భారత క్షిపణి పితామహుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్వీ-3 రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. అగ్ని, పృథ్వీ వంటి శక్తివంతమైన క్షిపణులను తయారు చేసి భారత్ను రక్షణ రంగంలో ప్రపంచ దేశాల సరసన అగ్రస్థానంలో నిలబెట్టారని చెప్పారు. భారత రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన కలాం రాష్ట్రపతి భవన్ తలుపులను సామాన్య ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచారన్నారు. అందుకే ఆయనను అందరూ ప్రజా రాష్ట్రపతిగా పిలుచుకునే వారని చెప్పారు. దేశానికి నిజమైన ఆస్తి యువతచ విద్యార్థులేనని చెప్పే వారన్నారు. సూర్యుడిలా ప్రకాశించాలంటే, ముందు సూర్యుడిలా మండడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారన్నారు. అలాంటి మహనీయుని జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని చెప్పారు. ఆయన ఆశయాల సాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో తోట ఉత్సవం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు అమ్మవారు దేవీవన విహారిణి (తోట ఉత్సవం) అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉదయం నుండి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోట ఉత్సవం అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.
అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



## ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కఠిన నిఘా



○ ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లకు కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు

**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ను పకడ్బందీగా అమలు చేయాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకునేలా ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.
గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, నిఘా వ్యవస్థ, ఫిర్యాదుల పరిష్కారం, తనిఖీల విధానం తదితర అంశాలపై అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు.
రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో నగరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని మయూర్ అశోక్ తెలిపారు. నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించడంతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.
ఎన్నికల సమయంలో అక్రమ నగదు రవాణా, మద్యం పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు, ఆయుధాలు, ఇతర అనుమానాస్పద వస్తువుల రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నగర ప్రవేశ మార్గాలు, ప్రధాన రహదారులు, అనుమానాస్పద ప్రాంతాల్లో చెక్పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు, వస్తువుల కదలికలను పరిశీలించాలని స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లను ఆదేశించారు.
తనిఖీల ప్రక్రియను తప్పనిసరిగా వీడియో చిత్రీకరించాలని, చేపట్టిన చర్యలకు సంబంధించిన రోజువారీ నివేదికలను రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు. రాజకీయ అభ్యర్థులు ర్యాలీలు, సభలు, ఇతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం నగర పాలక సంస్థలో సింగిల్ విండో విధానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఖర్చులపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపట్టాలని, రాజకీయ పార్టీల సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఏదైనా గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.
ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలపై నిఘా పెంచాలని, రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థుల సోషల్ మీడియా ఖాతాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం జరుగుతుందా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. మతపరమైన అంశాలను ఉపయోగించి ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు గుర్తించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
సమావేశంలో అదనపు కమిషనర్ జి. రవీంద్ర బాబు (ఎస్డబ్ల్యూ), మేనేజర్ బాలాజీ బాష, ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ల ప్రతినిధులు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

○ చెక్పోస్టులు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
○ ఎంసీసీ ఉల్లంఘనలపై తక్షణ చర్యలు తీసుకోవాలి
○ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలు--2026ను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల భద్రత, చెక్పోస్టుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలుపై జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సబ్ డివిజన్ పోలీసు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు.
ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్పోస్టుల వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్టీ) విధులను సమర్థంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని సూచించారు. నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగించే వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లకు అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అవసరమైన వీడియో చిత్రీకరణ చేపట్టి నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలన్నారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా**

హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎన్నికల సందర్భంగా అల్లర్లకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, ఇతర సమస్యాత్మక వ్యక్తులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టేబుళ్లు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.
ఓటర్లు సులభంగా వచ్చి ఓటు వేసి వెళ్లేందుకు క్యూలైన్లు, టెంట్లు, బారికేడ్లు, సూచిక బోర్డులు ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు.

**ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలి**

ఎంసీసీ బృందాలు నిర్వహించే తనిఖీలు, నమోదు చేసే ఉల్లంఘనలు, స్వీకరించే ఫిర్యాదులు, వాటిపై తీసుకుంటున్న చర్యలను డీఎస్పీలు ప్రతిరోజూ సమీక్షించాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి చర్యను నమోదు చేసి సంబంధిత ఉన్నతాధికారులు, ఎన్నికల అధికారులకు రోజువారీ నివేదికలు సమర్పించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, బందోబస్తు ప్రణాళికలను ముందుగానే పరిశీలించాలని సూచించారు.
నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ, ప్రచారం, పోలింగ్, స్ట్రాంగ్రూమ్ల భద్రత, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభపెట్టినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి ప్రతినిధులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.
సమావేశంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, డీఎస్పీలు టి. సీతారాం, బెల్లం శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, మురళీకృష్ణ, జనార్దన్రావు, డీసీఆర్బీ సీఐ ప్రభాకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలి




**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ బాధ్యత రిటర్నింగ్ అధికారులదని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు స్పష్టంగా అవగాహన పొంది, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు చేసిన ప్రతి పైసా జమ కావాలని చెప్పారు. అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు నిర్వహణకు ముందస్తు అనుమతి పొందాలని అన్నారు. మీడియాలో ప్రకటనలు ప్రచురితమైతే వాటిని ఖర్చులు క్రింద లెక్కించడం జరుగుతుందని తెలిపారు. స్టాట్యూటరీ, స్టాట్యూటరీ కాని అంశాలు పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, పోలింగ్ నిర్వహణ, లెక్కింపు విధానాల పట్ల అతి జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు.
**ఎన్నికల నియమావళి అమలు చేయాలి:** ఎన్నికల నియమావళి అమలు పక్కాగా చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్టాటిక్ టీమ్ లు, సర్వేలియన్స్ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, ఖర్చుల పరిశీలన బృందాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఎన్నికల నియమావళి అమలు చేయాలని, ప్రతీ రోజూ ఖర్చులు జమ చేసి, కంట్రోల్ రూమ్ కు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, లక్ష్మి కుమారి, శ్రీనివాస్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహా రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

○ జిల్లా కలెక్టర్ సి యం సాయికాంత్ వర్మ



**గుంటూరు, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ తెలిపారు.
గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు**

జిల్లాలో గుంటూరు, తెనాలి పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, అక్టోబర్ 28న పోలింగ్, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వివరించారు.
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి దశ నామినేషన్లు నవంబర్ 15న ప్రారంభమై నవంబర్ 26న పోలింగ్, రెండో దశ నామినేషన్లు నవంబర్ 18న ప్రారంభమై నవంబర్ 29న పోలింగ్, మూడో దశ నామినేషన్లు నవంబర్ 21న ప్రారంభమై డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ పూర్తయిన రోజే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

**ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు**

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 76 వార్డులు, తెనాలి పట్టణంలో 52 వార్డులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. గుంటూరు పరిధిలో 6,09,667 మంది, తెనాలి పరిధిలో 1,57,089 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ కోసం 50 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 50 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం ఉండదు**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన కుల ధృవీకరణ పత్రాల జారీలో ఎటువంటి జాప్యం ఉండదన్నారు. ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ కుల ధృవీకరణ పత్రం కలిగిన వారు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కుల ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసిన వారికి 24 గంటల్లోగా పత్రాలు అందించేలా ఏర్పాటు చేసామన్నారు. సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వాటిలో అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. జిల్లాలో 6000 మంది ఉద్యోగులను ఎన్నికల ప్రక్రియకు నియమించామన్నారు. ఈ పాత్రికేయ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల వసతి గృహాల నిర్వహణకు తొలిసారిగా మార్గదర్శకాల రూపకల్పన

○ విద్యార్థుల భద్రత, ఆర్థిక క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం
○ రూ.లక్ష దాటిన ఖర్చుకు డీఎంఈ ముందస్తు అనుమతి తప్పనిసరి
○ ర్యాగింగ్, వేధింపులపై కఠిన చర్యలు.. ఫిర్యాదుల పరిష్కారానికి ఏడు పనిదినాల గడువు



**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల పరిధిలోని వైద్య విద్యార్థుల వసతి గృహాల నిర్వహణలో ఆర్థిక పారదర్శకత, విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ నమూనా మార్గదర్శకాలను జారీ చేశారు. వసతి గృహాల ఆదాయ, వ్యయాలకు పక్కాగా లెక్కలు నిర్వహించాలని, రూ. లక్ష దాటిన ఖర్చులకు ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులు, బెదిరింపులు, హింస వంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకూడదని ఆదేశించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ఈ మార్గదర్శకాలను అనుసరించాలని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు సూచించారు. వసతి గృహాల నిర్వహణకు ఇప్పటికే కళాశాలలవారీగా నిబంధనలు ఉన్నప్పటికీ, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో తొలిసారిగా నమూనా మార్గదర్శకాలను రూపొందించి పంపారు.

**ర్యాగింగ్, వేధింపులపై కఠిన చర్యలు**

రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వసతి గృహాల్లో నిశ్శబ్దం పాటించాలి. వార్డెన్ అనుమతి లేకుండా పెద్ద శబ్దంతో సంగీతం, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదు. ర్యాగింగ్, బెదిరింపులు, లైంగిక వేధింపులు, మద్యం, పొగాకు, మత్తు పదార్థాలు, ఆయుధాలు, జూదం, అనధికార ప్రవేశం, ఆస్తుల ధ్వంసం వంటి చర్యలను నిషేధించారు.
నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి కౌన్సెలింగ్, హెచ్చరిక, నష్టపరిహారం విధించడం, సదుపాయాలను ఉపసంహరించడం, 15 రోజుల వరకు సస్పెన్షన్, వసతి రద్దు లేదా కళాశాల నుంచి తొలగింపు వంటి చర్యలు తీసుకోవచ్చు. ర్యాగింగ్, లైంగిక వేధింపుల ఫిర్యాదులను సంబంధిత చట్టబద్ధ వ్యవస్థలకు వెంటనే నివేదించాలి.

**ఫిర్యాదులపై ఏడు పనిదినాల్లో పరిష్కారం**

సాధారణ ఫిర్యాదులను ఏడు పనిదినాల్లో పరిష్కరించాలి. తీవ్రమైన ఫిర్యాదులను వెంటనే ప్రధాన వార్డెన్కు, అవసరమైన చట్టబద్ధ వ్యవస్థలకు పంపాలి. ఫిర్యాదులను ప్రైవేటుగా రాజీ చేయకూడదు. ఫిర్యాదుల పెట్టెను వారానికి ఒకసారి తెరిచి పరిశీలించాలి.
వార్డెన్ వారానికి రెండుసార్లు వసతి గృహాన్ని తనిఖీ చేయాలి. విద్యార్థుల వసతి గృహ కమిటీ, పరిపాలనాధికారి నెలకోసారి తనిఖీ నిర్వహించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదిక రూపొందించి, తదుపరి నెల 15వ తేదీలోగా డీఎంఈకి పంపాలి.

**తాగునీటి నాణ్యత, అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు**

తాగునీటిలో బ్యాక్టీరియా పరీక్షలు నెలకోసారి, రసాయన పరీక్షలు ఆరు నెలలకోసారి నిర్వహించాలి. నీటి ట్యాంకులను మూడు నెలలకోసారి శుభ్రం చేయాలి. అగ్నిమాపక పరికరాలను మూడు నెలలకోసారి పరిశీలించాలి.
విద్యార్థుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా నిఘా కెమెరాలను వినియోగించాలి. వాటి దృశ్యాలను 30 రోజులపాటు భద్రపరచాలి. వసతి గృహాల్లో భోజన నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలన్నింటినీ కచ్చితంగా అమలు చేయాలి.

**నిధుల సమీకరణ, వినియోగానికి స్పష్టమైన విధానం**

వసతి గృహాల నిర్వహణకు ప్రధానంగా రెండు మార్గాల్లో నిధులు సమకూరుతాయి. ప్రవేశ సమయంలో నిబంధనల ప్రకారం వసూలు చేసే తిరిగి చెల్లించని డిపాజిట్, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల నుంచి నెలవారీగా వసూలు చేసే నిర్వహణ రుసుము. ఈ రెండు మొత్తాలను వేర్వేరు లెక్కల పుస్తకాల్లో నమోదు చేయాలి.
డిపాజిట్ నిధులను అనుమతించిన నిబంధనల ప్రకారం ఫర్నిచర్, చదువుకునే సదుపాయాలు, క్రీడలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర శాశ్వత సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలి. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల వసతి గృహ కమిటీ సిఫారసుల మేరకు ప్రధాన వార్డెన్ నిర్వహణ రుసుమును ఖరారు చేసి నోటీసు బోర్డులో ప్రకటించాలి. విద్యార్థులు ప్రతి నెలా పదో తేదీలోగా రుసుము చెల్లించాలి.

**రూ.లక్ష దాటిన ఖర్చుకు ముందస్తు అనుమతి**

ఒక వస్తువు కొనుగోలు లేదా పనికి డిపాజిట్, నిర్వహణ నిధుల నుంచి చేసే ఖర్చు రూ. లక్ష దాటితే డీఎంఈ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. అనుమతి పరిమితిని తప్పించుకునేందుకు ఒకే పనిని చిన్నచిన్న భాగాలుగా విభజించడం ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణిస్తారు. విద్యార్థుల వసతి గృహ కమిటీ, కళాశాల అభివృద్ధి కమిటీ సిఫారసులతో వార్డెన్ వార్షిక బడ్జెట్ను రూపొందించి ఏప్రిల్ 30లోగా ప్రధాన వార్డెన్ ఆమోదానికి సమర్పించాలి. ప్రత్యేకంగా అనుమతించిన వసతి గృహ ఖాతాను నిబంధనల ప్రకారం ప్రిన్సిపల్ లేదా ప్రధాన వార్డెన్, వార్డెన్ లేదా ఉప వార్డెన్ సంయుక్తంగా నిర్వహించాలి.

ప్రతి నెలా ఆదాయ, వ్యయాల నివేదిక

ప్రతి నెలా ఆదాయం, ఖర్చులు, ప్రారంభ నిల్వ, నిర్వహణ రుసుము, డిపాజిట్లు, ఇతర అనుమతించిన ఆదాయాలు, అభివృద్ధి వ్యయం, బకాయిలు, ముగింపు నిల్వ వివరాలతో నివేదిక రూపొందించాలి. తదుపరి నెల పదో తేదీలోగా ప్రధాన వార్డెన్ ఆమోదం పొందాలి. ఆ నివేదికను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి.
ప్రతి ఆర్థిక సంవత్సరంలో వసతి గృహాల ఖాతాల తనిఖీ నిర్వహించాలి. తనిఖీలో వచ్చిన అభ్యంతరాలకు 30 రోజుల్లో సమాధానమివ్వాలి. తీసుకున్న చర్యల నివేదికను ప్రధాన వార్డెన్, డీఎంఈకి పంపాలి. మిగిలిన నిధులను సంబంధిత ఖాతాల్లోనే కొనసాగించాలి. ముందస్తు అనుమతి లేకుండా ఇతర అవసరాలకు మళ్లించకూడదు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## జగన్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఫైర్



- దేశంలో అస్థిరతకు దారితీసే శక్తులతో కలిసి పని చేస్తున్నారంటూ మండిపాటు

**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** అవినీతి వ్యతిరేక పోరాటం, ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ మాట్లాడే సీజేపీ.. అవినీతి ఆరోపణలకు సంబంధించి ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చేతులు కలపడాన్ని ఎలా సమర్థించుకుంటారని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా జగన్ వైఖరిపై ఆయన విమర్శలు చేశారు.

జగన్ పాలనలో రాష్ట్రంలో దేవాలయాలకు సంబంధించిన పలు ఘటనలు, దేవాలయ ఆస్తుల అంశాలు, మత మార్పిడులపై అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని మాధవ్ ప్రస్తావించారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం పడిందని ఆరోపించారు. ప్రస్తుతం రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలో వివిధ శక్తులతో కలిసి పనిచేస్తున్న తీరు ఆయన రాజకీయ వైఖరిని వెల్లడిస్తోందని వ్యాఖ్యానించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాల హక్కులు, రాజకీయ స్వేచ్ఛకు ఎదురైన సవాళ్లను, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని మాధవ్ అన్నారు. శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కేనని, అయితే హింస, రాళ్లదాడులు, పోలీసులపై దాడులు, మహిళలు, భద్రతా సిబ్బందిపై దాడులను సమర్థించలేమని పేర్కొన్నారు. పోలీసుల చట్టబద్ధ చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం మాజీ ముఖ్యమంత్రికి తగదని అన్నారు.

అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో ముందుకు వచ్చే సంస్థలు.. అవినీతి కేసులను ఎదుర్కొంటున్న రాజకీయ నేతలతో కలిసి పనిచేయడం వారి నినాదాలు, ఆచరణ మధ్య ఉన్న వైరుధ్యాన్ని చూపిస్తోందని మాధవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యం పేరుతో అస్థిరత, హింసకు దారితీసే రాజకీయాలకు ప్రజలు తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

## కలాం ఆశయాలతో దేశ ప్రగతికి కృషి చేయాలి



- యువతలో విజ్ఞాన స్ఫూర్తి నింపిన మహనీయుడు డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం
- గుంటూరులో ఘనంగా కలాం జయంతి వేడుకలు

**గుంటూరు, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలు, ఆలోచనలు నేటి యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని భాజపా గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. దేశ ప్రగతిని లక్ష్యంగా చేసుకుని కలాం కలలను సాకారం చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా భాజపా గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో కలాం కీలక పాత్ర పోషించారని తిరుపతిరావు పేర్కొన్నారు.

కలాం సూచించిన మార్గంలో యువత విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన రంగాల్లో ముందుకు సాగాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తిరుపతిరావు పిలుపునిచ్చారు. భారతదేశాన్ని మరింత అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని అన్నారు.

కార్యక్రమానికి గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాంబశివరావు అధ్యక్షత వహించారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైరోజ్ ఖాన్, రాష్ట్ర కార్యనిర్వాహకుడు గౌస్ పీరా, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి షేక్ రఫీ, జిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు షేక్ మౌలాలి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శులు కె. నారాయణరెడ్డి, బజరంగ్ రామకృష్ణ, సురేష్ జైన్, అరవింద్ జైన్, ఎస్సీ మోర్చా నాయకుడు ఏసుబాబు, మండల అధ్యక్షురాలు భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ టీచర్లకు ప్రభుత్వ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

- జీవో నంబర్ 23 ప్రకారం ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించాలి: ఎంఎస్‌పీటీఏ

**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బందికి జీవో నంబర్ 23 ప్రకారం ప్రభుత్వ సర్వీస్ రూల్స్ అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని ప్రయోజనాలను కల్పించాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీ షఫీ ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక సమావేశం బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని మోడల్ స్కూల్ టీచర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుమారు గంటపాటు చర్చించారు. జీవో నంబర్ 23 ప్రకారం ఏపీ మోడల్ స్కూల్స్‌ను పాఠశాల విద్యాశాఖలో పూర్తిగా విలీనం చేసినప్పటికీ, అధికారులు ఇప్పటికీ 'మోడల్ స్కూల్స్ సొసైటీ' అనే అంశాన్ని ప్రస్తావించడం వల్ల ఉపాధ్యాయులకు అందాల్సిన ప్రభుత్వ ప్రయోజనాలు ఆలస్యం అవుతున్నాయని వారు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న హిందీ టీజీటీలను పీజీటీలుగా ఉన్నతీకరించాలని, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలని వారు కోరారు. అలాగే పీజీటీ తెలుగు పోస్టును పునరుద్ధరించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, జీవో నంబర్ 23 అమలుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి ప్రభుత్వ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఎస్‌పీటీఏ నాయకులు కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల్లో వైద్య సేవలకు విస్తృత ఏర్పాట్లు

- దుర్గమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం



**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో వైద్యారోగ్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది 16 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, 49 మంది వైద్యాధికారులు, 30 మంది ప్రత్యేక వైద్యులు, 431 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించింది. అత్యవసర సేవల కోసం 9 అంబులెన్సులను అందుబాటులో ఉంచింది. వైద్య సేవల పర్యవేక్షణ కోసం 19 సెక్టార్లను ఏర్పాటు చేసి, ఆరుగురు కార్యక్రమ అధికారులను నియమించింది. కార్యక్రమ సమన్వయ అధికారి పోస్టును కూడా కొత్తగా ఏర్పాటు చేసింది.

అక్టోబరు 21 వరకు దసరా ఉత్సవాల వైద్య సేవలు కొనసాగుతాయి. ఈ వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**పెరిగిన వైద్య సేవలు:** దసరా ఉత్సవాల మొదటి నాలుగు రోజుల్లో ఈ ఏడాది 31,228 మంది వైద్య సేవలు పొందారు. ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రవణబాబు, సీనియర్ అధికారి డాక్టర్ జె. ఇందుమతి దేవీరావు క్షేత్రస్థాయిలో భక్తులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**సారస్ మేళాలోనూ ప్రత్యేక వైద్య సేవలు**

సారస్ మేళా సందర్భంగా అక్టోబరు 31 వరకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఐదు పడకల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రథమ రిఫరల్ వైద్యశాలగా భవానీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుర్తించారు. విజయవాడ ఉత్సవాల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని, ఉన్నత స్థాయి వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక రిఫరల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల కోసం 15 మంది వైద్యాధికారులు, ఐదుగురు ప్రత్యేక వైద్యులు, 85 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించారు. అత్యవసర సేవల కోసం 108 అంబులెన్సులను నాలుగు ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకటరమణ తెలిపారు.

## నర్సింగ్ ప్రవేశాలపై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన డీఎంఈ

**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో 280 బీఎస్సీ (నర్సింగ్) కళాశాలలు ఉండగా, వీటిలో 249 కళాశాలల్లో మొదటి కౌన్సెలింగ్‌లో ప్రవేశాలకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. మరో 10 కళాశాలలు ప్రవేశాలకు పూర్తి అర్హతలు కలిగి ఉన్నాయని, ఏపీఎన్ఎంసీ (ఆంధ్రప్రదేశ్ నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్) ఇప్పటికే విశ్వవిద్యాలయానికి తెలియజేసింది. ఫిర్యాదులు, తనిఖీల కారణంగా అ-ర్హతలు ఉన్న మిగిలిన కళాశాలల్లో ప్రవేశాలను రెండో కౌన్సెలింగ్‌లో చేపడతారని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ గురువారం ఒక పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు. బీఎస్సీ (నర్సింగ్) ప్రవేశాలతోపాటు 50 కళాశాలలు పోస్ట్ బేసిక్ బీఎస్సీ (నర్సింగ్), 31 కళాశాలలు ఎంఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత పొందాయని డీఎంఈ తెలిపారు. మొదటి కౌన్సెలింగ్ ప్రవేశాలకు ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ అయింది.

**ప్రవేశాలపై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన డీఎంఈ:** మొత్తం 280 కళాశాలల్లో ఇప్పటికే 249 కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, 150 నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలను అర్థం లేకుండా పెండింగ్‌లో ఉంచారని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని, దురుద్దేశపూర్వకమైనదని స్పష్టం చేశారు. 249 కళాశాలల్లో ప్రవేశాలకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి పంపిన ప్రతిపాదనకు సంబంధించి ఒక్క ఫైలు కూడా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆమోదం కోసం పంపలేదని, ఏపీఎన్ఎంసీ నివేదిక మేరకు వాటిని నేరుగా విశ్వవిద్యాలయానికి పంపినట్లు డీఎంఈ స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా మంత్రి కార్యాలయ అధికారుల జోక్యంతో 150 కళాశాలల్లో ప్రవేశాలు పెండింగ్‌లో పడిపోయినట్లు జరుగుతున్న ప్రచారం తప్పని వివరించారు.

**ప్రవేశాలు పెండింగ్‌లో ఉన్న నర్సింగ్ కళాశాలల వివరాలు:** మరో 10 నర్సింగ్ కళాశాలలు ప్రవేశాలకు అర్హత పొందాయని, ఆ మేరకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ప్రతిపాదన పంపినట్లు డీఎంఈ పునరుద్ఘాటించారు. ప్రవేశాల కోసం వేచి ఉన్న మరో 21 నర్సింగ్ కళాశాలల్లో 17 చోట్ల ఏపీఎన్ఎంసీ తనిఖీలు, పునఃతనిఖీలు జరుగుతున్నాయి. వీటిలో 11 కళాశాలలు అర్హత ప్రమాణాలను పాటించలేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్‌కు ఫిర్యాదులు రాగా, వాటి పరిశీలన కోసం మంత్రి డీఎంఈకి పంపారు. ఈ కారణంగా ఈ 11 చోట్ల పునఃతనిఖీలు చేపట్టారు. ఒక కళాశాలకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. మరో కళాశాల ప్రవేశాల అనుమతి కొనసాగింపు (రెన్యూవల్) కోసం ఫీజు చెల్లించలేదు. ఎసెన్షియాలిటీ సర్టిఫికెట్ రద్దయిన కారణంగా రెండు కళాశాలలు ప్రవేశాల అర్హతను కోల్పోయాయి.

**ఐఎన్‌సి మార్గదర్శకాల ప్రకారం:** నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలను భారతీయ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) మార్గదర్శకాల ప్రకారమే అనుమతిస్తున్నామని, నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రతి కళాశాలను తనిఖీ చేసిన తర్వాతనే ప్రవేశాలకు అనుమతులు ఇస్తున్నామని, తనిఖీల కారణంగా మొదటి కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు జరగని నర్సింగ్ కళాశాలల్లో అర్హతలు ఉన్న అన్నిచోట్ల రెండో కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు జరుగుతాయని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు.

## ఎస్ఆర్ఎంలో పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ ఫ్రేమ్‌వర్క్‌పై జాతీయ సదస్సు

- సైబర్ భద్రతా సవాళ్లపై నిపుణుల చర్చలు



**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ ఫ్రేమ్‌వర్క్‌పై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యావేత్తలు, అంకుర సంస్థల ప్రతినిధులు, బ్యాంకింగ్ రంగ నిపుణులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు.

ప్రాంతీయ స్థాయిలో జరుగుతున్న లోతైన పరిశోధనలను అంతర్జాతీయ సైబర్ భద్రతా ప్రమాణాలతో అనుసంధానించడం, భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్ వల్ల ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం వంటి అంశాలపై నిపుణులు చర్చించారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు. క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిన విద్యాసంస్థల్లో ఎస్ఆర్ఎం ఒకటని పేర్కొన్నారు. ఆధునిక పరిశోధనా సదుపాయాలు, సహకారానికి అనుకూలమైన విధానాల ద్వారా అంతర్జాతీయ పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు.

పోస్ట్ క్వాంటమ్ క్రిప్టోగ్రఫీపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ నిపుణుల కమిటీ ఛైర్మన్ డాక్టర్ సుదీప్ ఒబెరాయ్ జాతీయస్థాయిలో ఎదురవుతున్న విధానపరమైన సవాళ్లను వివరించారు. క్రిప్టోగ్రాఫిక్ అల్గారిథమ్‌ల సంసిద్ధతను అంచనా వేయడం, డిజిటల్ సర్టిఫికెట్లు, డిజిటల్ సంతకాల భద్రతకు అవసరమైన జాతీయ ప్రమాణాలను రూపొందించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యతలని తెలిపారు.

క్వాంటమ్ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ధ్రువీకరించగల హార్డ్‌వేర్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్పష్టమైన మార్గదర్శకాల రూపకల్పనపైనా సదస్సులో చర్చించారు. భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్‌తో ఏర్పడే సైబర్ భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# బొద్దింకలు.. వైసీపీ మధ్య స్నేహ బంధం బయటపడింది

- విదేశీ నిధులను ఒకటి.. స్వదేశీ నిధులను మరొకటి మింగేస్తున్నాయి
- జగన్‌తో కాంగ్రెస్ చేతులు కలపడం విడ్డూరం
- ఓటు చోరీ ఆరోపణల్లో వాస్తవాలను ప్రజలు గమనించాలి
- బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్



**విజయవాడ, అక్టోబర్ 15 (జర్నలిస్ట్ ఫైల్):** బొద్దింకలు, వైసీపీ మధ్య ఉన్న స్నేహ బంధం తాజాగా బయటపడిందని బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్ వ్యాఖ్యానించారు. ఒకటి విదేశీ నిధులతో పనిచేస్తుంటే.. మరొకటి స్వదేశీ నిధులను మింగేస్తోందంటూ బొద్దింకలతో వైసీపీని పోల్చారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో కాంగ్రెస్ చేతులు కలపడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనల్లో జగన్ భాగస్వామి కావడం ద్వారా ఆ రెండు పార్టీల రాజకీయ ఉద్దేశాలు స్పష్టమవుతున్నాయని పేర్కొన్నారు.

జగన్‌పై సీబీఐ, ఈడీ కేసులు, మనీలాండరింగ్, అక్రమాస్తులకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని దిలీప్ తెలిపారు. ఎన్నికల అఫిడవిట్లలో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ 2009లో రూ.72.81 కోట్లు, 2011లో రూ.445 కోట్లు, 2014లో రూ.416 కోట్లు, 2019లో రూ.510 కోట్లు, 2024లో రూ.757.65 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు, ప్రభుత్వ రాయితీలు, ప్రాజెక్టులు, ఆస్తుల అటాచ్‌మెంట్‌లకు సంబంధించిన అంశాలపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

2019–24 మధ్య మద్యం విధానం, ఇసుక తవ్వకాలకు సంబంధించి భారీ అవినీతి ఆరోపణలు వచ్చాయని దిలీప్ అన్నారు. డాక్టర్ సుధాకర్ ఘటన, దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకేసు, ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టడీ వ్యవహారం, అమరావతి, మూడు రాజధానుల అంశాలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై దాడులు, రాజకీయ నిరసనలను అడ్డుకున్న ఘటనలపై వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

అవినీతి గురించి మాట్లాడే ముందు కాంగ్రెస్ గత పాలనలో ఎదుర్కొన్న వివాదాలకు సమాధానం చెప్పాలని దిలీప్ అన్నారు. జీపుల కొనుగోలు, ముంద్రా–ఎల్ఐసీ, ఏ.ఆర్. అంతులే ట్రస్టులు, హెచ్‌డీడబ్ల్యూ జలాంతర్గాములు, బోఫోర్స్, హర్షద్ మెహతా సెక్యూరిటీస్, జేఎంఎం ఎంపీల లంచాల కేసు, పామాయిల్ దిగుమతులు, 2జీ స్పెక్ట్రం, బొగ్గు బ్లాకుల కేటాయింపులు, కామన్వెల్త్ క్రీడలు, ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ తదితర వివాదాలను ఆయన ప్రస్తావించారు. ఈ అంశాల గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో వైసీపీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని దిలీప్ తెలిపారు. వైఎస్సార్‌సీపీకి 45,973, టీడీపీకి 44,603, బీజేపీకు 27,583, జనసేనకు 8,988 మంది బూత్ స్థాయి ఏజెంట్లు ఉన్నారని, మొత్తం 1,27,868 మంది ఏజెంట్లు ప్రక్రియలో పాల్గొన్నారని పేర్కొన్నారు. తమ ఏజెంట్లతోపాటు వైసీపీ ఏజెంట్లు కూడా పాల్గొన్న ప్రక్రియపై ఇప్పుడు కాంగ్రెస్‌తో కలిసి ఓటు చోరీ ఆరోపణలు చేయడంలో ఉన్న వైరుధ్యాన్ని జగన్ వివరించాలని డిమాండ్ చేశారు.

మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, పునరావృత నమోదులు, ఒకే వ్యక్తికి బహుళ ప్రాంతాల్లో ఓట్లు వంటి అంశాలను గుర్తించి సరిచేయడమే ఓటర్ల జాబితా శుద్ధీకరణ లక్ష్యమని దిలీప్ చెప్పారు. అసలు ఓటర్ల హక్కులను కాపాడుతూ జాబితాలోని తప్పులను సరిచేసే ప్రక్రియను రాజకీయ ప్రయోజనాల కోసం 'ఓటు చోరీ'గా చిత్రీకరించకూడదన్నారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పార్టీలు ఇప్పుడు అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో ఏకం కావడాన్ని ప్రజలు గమనించాలని దిలీప్ కోరారు. ఎస్ఐఆర్‌లో తమ పార్టీ ఏజెంట్ల భాగస్వామ్యాన్ని ఒకవైపు ప్రస్తావిస్తూ, మరోవైపు ఓటు చోరీ ఆరోపణలు చేయడంపై జగన్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి







- ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి.శ్యామ్ సుందర్ వినతి

**అమరావతి, అక్టోబర్ 15(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ వైద్యులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, మెరుగైన ప్రజారోగ్య సేవలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఏకైక ప్రభుత్వ వైద్యుల సంఘమైన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకల శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. దుర్గాప్రసాద్ డీఎస్ హెచ్, డీఎంఈ, డీహెచ్ లకు విజ్ఞప్తి చేసారు. .

**యూజీసీ పీఆర్సీ బకాయిలు చెల్లించాలి**

డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న టీచింగ్ వైద్యులకు 2016 యూజీసీ పీఆర్సీకి సంబంధించిన బకాయిలు ఇంకా అందలేదని తెలిపారు. బకాయిల ప్రస్తుత స్థితిని వెల్లడించి, త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టైమ్‌బౌండ్ ప్రమోషన్లు మంజూరైనప్పటికీ జనరల్ ప్రమోషన్లకు అనవసరమైన నిబంధనలు విధించడం వల్ల సీనియర్ ఫ్యాకల్టీకి న్యాయంగా లభించాల్సిన సర్వీస్ ప్రయోజనాలు దక్కడం లేదని పేర్కొన్నారు.

**కొత్త వైద్య కళాశాలల్లో వైద్యుల కొరత**

కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో కొన్ని విభాగాల్లో కేవలం ఒకటి నుంచి ముగ్గురు వైద్యులతోనే 24 గంటల పాటు సేవలు నిర్వహించాల్సి వస్తోందని సంఘం తెలిపింది. దీనివల్ల వైద్యులపై తీవ్ర పని భారం పడటంతో పాటు రోగులకు అందించే సేవలపై ప్రభావం పడుతోందని పేర్కొంది. ఖాళీలను తక్షణమే భర్తీ చేయడంతో పాటు అవసరమైతే డిప్యుటేషన్ ప్రాతిపదికన వైద్యులను నియమించాలని కోరింది.

అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో వైద్యులకు సబ్సిడీ క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది.

**సెకండరీ హెల్త్ విభాగంలో ప్రమోషన్లు కల్పించాలి**

సెకండరీ హెల్త్ విభాగంలో వివిధ స్పెషాలిటీలకు చెందిన వైద్యులకు చాలా కాలంగా ప్రమోషన్లు లభించడం లేదని సంఘం తెలిపింది. ఈ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఇటీవల సెకండరీ హెల్త్ విభాగంలో తగిన సంఖ్యలో ఎంబీబీఎస్ వైద్యులను నియమించినందున, స్పెషలిస్ట్ వైద్యులను వారి సంబంధిత స్పెషాలిటీ సేవలు, కాల్ డ్యూటీలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేసింది. సాధారణ క్యాజువాలిటీ, ఎంఎల్‌సీ, పోస్టుమార్టం విధులతో స్పెషలిస్ట్ వైద్యులపై అదనపు భారం మోపకూడదని పేర్కొంది.

**మెడ్‌లీఅప్ పోర్టల్‌పై పని భారం తగ్గించాలి**

ఎంఎల్‌సీ, పోస్టుమార్టం నివేదికలను మెడ్‌లీఅప్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం బిజీ క్లినికల్ సమయాల్లో వైద్యులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోందని సంఘం తెలిపింది. ప్రతి ఏరియా ఆసుపత్రికి కేస్‌వర్కర్ లేదా ఫోరెన్సిక్ స్పెషలిస్ట్‌ను నియమించాలని, కనీసం ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ప్రత్యేకంగా నివేదికల అప్‌లోడింగ్ కోసం కేటాయించాలని కోరింది.

ఈఎన్టీ, ఆప్తాల్మాలజీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, రేడియాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాల్లో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఎస్ఎస్ ) పోస్టులు లేకుండా పోయాయని తెలిపారు. జిల్లా స్థాయి సీఎస్ఎస్ పోస్టులను వైద్య కళాశాలలకు పునర్వినియోగించిన నేపథ్యంలో, ఈ ఏడు విభాగాల్లో జూా పోస్టులను పునరుద్ధరించాలని కోరారు.

**డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వైద్యులకు ప్రమోషన్లు ఇవ్వాలి**

డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న వైద్యులు దశాబ్దాలుగా ప్రమోషన్లు లేకుండా పనిచేస్తున్నారని సంఘం పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని తెలిపింది. డీహెచ్ పరిధిలోని మెడికల్ ఆఫీసర్లకు టైమ్‌బౌండ్ ప్రమోషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రిని కోరింది.

**యాప్‌లలో డేటా ఎంట్రీ పనులు తగ్గించాలి**

వైద్యులు తమ ప్రధాన వైద్య సేవలు, రోగుల సంరక్షణపై దృష్టి సారించాల్సిన సమయంలో వివిధ మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పనులకు అధిక సమయం కేటాయించాల్సి వస్తోందని సంఘం తెలిపింది. యాప్ ఆధారిత డేటా ఎంట్రీ పనులను సహాయక సిబ్బందికి అప్పగించాలని కోరింది.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com